ప్రజాశక్తి

సోమవారం 26 మే 2025

8 పేజీలు



ఎన్‌టిఆర్



కృష్ణా

రేషన్ దుకాణాల ద్వారా సరుకులు

- ఎండియు వాహనాలు రద్దు
- వచ్చే నెల ఒకటి నుంచి అమలు
- 957 రేషన్ దుకాణాలు • 2.63 లక్షల కార్డులు
- ఎన్‌టిఆర్ జిల్లా సివిల్ సప్లై అధికారి పాపారావు



ప్రజాశక్తి-విజయవాడ

రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం మేరకు వచ్చే నెల నుంచి చౌక ధరల దుకాణాల ద్వారా డీలర్లు బియ్యం, ఇతర సరుకులను పంపిణీ చేస్తామని, ఇంటింటికీ తిరిగే ఎండియు వాహనాలు ఈ నెలాఖరుతో రద్దు అవుతాయని ఎన్‌టిఆర్ జిల్లా సివిల్ సప్లై అధికారి (డిఎస్ఒ) ఎ.పాపారావు తెలిపారు. కార్డుదారులు వారి పరిధిలో ఉన్న రేషన్ డిపోలకు వెళ్లి సరుకులు తీసుకోవాల్సి ఉంటుందన్నారు. ఎన్‌టిఆర్ జిల్లాలో వచ్చే నెల నుంచి రేషన్ దుకాణాల ద్వారా నిత్యావసరాల పంపిణీపై డిఎస్ఒ 'ప్రజాశక్తి'కి ప్రత్యేక ఇంటర్వ్యూనిచ్చారు.

ప్రశ్న: ఎప్పటి నుంచి డీలర్లు సరుకులు పంపిణీ చేస్తారు?

జవాబు: ప్రభుత్వ ఆదేశాల మేరకు వచ్చే నెల ఒకటి నుంచి చౌక ధరల దుకాణాల వద్దకు లబ్ధిదారులు వెళ్లి బియ్యంతో పాటు ఇతర సరుకులు తీసుకోవాల్సి ఉంటుంది. (మిగతా 2లో)



పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

ప్రశాంతంగా సివిల్స్ ప్రిలిమినరీ పరీక్ష

వార్త 2లో

వీధి వ్యాపారులపై ప్రతాపం

- లెనిన్ సెంటర్లో 53 బండ్లు తొలగింపు
- అధికార పార్టీ నేతల ఆగడాలు
- క్రమబద్ధీకరణ అంటున్న అధికారులు
- ఉపాధి లేక ఇబ్బందులు పడుతున్న కుటుంబాలు



లెనిన్ సెంటర్లో బండ్లు తొలగిస్తున్న విఎంసి సిబ్బంది (ఫైల్)

ప్రజాశక్తి-విజయవాడ

విజయవాడ నగరంలో వీధి వ్యాపారుల పరిస్థితి కడు దయనీయంగా తయారైంది. అటు ప్రజాప్రతినిధులు, ఇటు నగరపాలకసంస్థ అధికారులు, పోలీసుల వేధింపులు, బెదిరింపులు, హెచ్చరికలతో వారి వృత్తి ప్రశ్నార్థకంగా తయారైంది. కూటమి ప్రభుత్వం వచ్చిన ఈ కాలంలో ఆయా తరగతుల ప్రజలకు జీవనోపాధి కల్పించడం ఏమో కానీ ఉన్న ఉపాధిపై దెబ్బకొడుతున్నారు. ఇటువంటి చర్యలు ఆయా వర్గాల ప్రజల్లో తీవ్ర విమర్శలకు దారితీస్తున్నాయి. సుప్రీంకోర్టు ఆదేశాలను సైతం తుంగలోతొక్కి అధికారం చేతిలో ఉందనే ఆలోచనతో వీధి వ్యాపారులను పలు రూపాల్లో వేధింపులకు గురి చేస్తున్నారు. నగరపాలక సంస్థ అధికారులపై ఒత్తిడు పెంచి తమకు అన్ని విధాలుగా అనుకూలంగా లేరనుకున్న వీధి వ్యాపారులను పలు రూపాల్లో ఇబ్బందులకు గురి చేస్తున్నారు.

లెనిన్ సెంటర్, బీసెంట్ రోడ్డు, ఇతర పలు ప్రాంతాల్లో దశాబ్దాల తరబడి (మిగతా 2లో)

ప్రజా సమస్యలపై ఉద్యమ కార్యాచరణ

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు పిలుపు



సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు

ప్రజాశక్తి - డెస్క్ : జిల్లాలో గుర్తించిన ప్రజా సమస్యలపై కార్యాచరణ రూపొందించుకుని ఉద్యమించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. సిపిఎం ఎన్‌టిఆర్ జిల్లా విస్తృత సమావేశంఆదివారం విజయవాడలోని ఎంబి విజ్ఞాన కేంద్రంలో రాష్ట్ర కమిటీ సభ్యులు దోనేపూడి కాశీనాథ్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ముందుగా మధురైలో జరిగిన పార్టీ జాతీయ మహాసభ విశేషాలు, నిర్మాణ నివేదిక రాజకీయ తీర్మానాల గురించి బాబూరావు వివరించారు. సొంత బలం పెంచుకోవడం ద్వారా పార్టీని బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. అంతర్జాతీయ, జాతీయ, రాష్ట్ర పరిస్థితులపై మాట్లాడారు. స్థానికంగా నిర్దిష్ట సమస్యలను గుర్తించి పోరాటాలు నిర్వహించాలన్నారు. ఉద్యమాల నిర్వహణలో కాలానుగుణంలో మార్పులు చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. సృజనాత్మకంగా ఆలోచించి ఉద్యమ రీతులను రూపొందించుకోవాలని అన్నారు. పార్టీ శ్రేణులు నిత్యం ప్రజా సమస్యలపై అధ్యయనం చేయాలన్నారు. సమస్యలపై చేపట్టే ఉద్యమాల్లో రకరకాల పద్ధతుల్లో ప్రజలను భాగస్వాములను చేయాలన్నారు. సిపిఎం ఎన్‌టిఆర్ జిల్లా కార్యదర్శి డి.వి.కృష్ణ మాట్లాడుతూ జిల్లాలో నిర్వహించిన ప్రజా చైతన్య యాత్రల్లో గుర్తించిన సమస్యలు పరిష్కారమయ్యే (మిగతా 2లో)

నేడు అర్జీలు స్వీకరణ

ప్రజాశక్తి-విజయవాడ: ఈ నెల 26వ తేదీ సోమవారం కలెక్టరేట్‌లోని పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమం ద్వారా ప్రజల నుండి వినతులు స్వీకరించనున్నట్లు ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టరేట్, డివిజన్, మునిసిపల్, మండల కేంద్రాల్లో సంబంధిత అధికారులు అర్జీలు స్వీకరిస్తారన్నారు.

మొదటిపేజీ తరువాయి

రేషన్ దుకాణాల ద్వారా సరుకులు

దీనిని ప్రతి కార్డుదారుడు గమనించాలి. ఇంటింటికీ వాహనాల ద్వారా సరుకు పంపిణీ గత వైసిపి ప్రభుత్వం కాలంలో 2022 జనవరి నుంచి అమల్లోకి వచ్చింది. ప్రస్తుత ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం మేరకు వాహనాల ద్వారా సరుకు పంపిణీ ఉండదు.

ప్రశ్న: జిల్లాలో ఎన్ని డిపోలున్నాయి? రద్దవుతున్న వాహనాలెన్ని?

జవాబు: 957 చౌక ధరల దుకాణాల ద్వారా డీలర్లు జిల్లాలో బియ్యం, ఇతర సరుకుల పంపిణీ చేస్తారు. ఇదే క్రమంలో 374 ఎండియు వాహనాలు రద్దవుతాయి. ఒక్క విజయవాడ నగరంలోనే 267 చౌక డిపోల ద్వారా సరుకుల పంపిణీ చేస్తారు.

ప్రశ్న: జిల్లాలో తెల్ల రేషన్ కార్డులు ఎన్ని ఉన్నాయి?

జవాబు: ఎన్‌టిఆర్ జిల్లాలో తెల్లరేషన్‌కార్డులు 2.63 లక్షలు ఉన్నాయి. అంత్యోదయ అన్న యోజన (ఎఎవై) కార్డులు మరో 5,200 ఉన్నాయి.

ప్రశ్న: ప్రతి నెల ఎన్ని క్వింటాళ్ల బియ్యం పంపిణీ జరుగుతుంది?

జవాబు: విజయవాడ నగరంతో పాటు జిల్లా వ్యాప్తంగా 80 వేల క్వింటాళ్ల బియ్యం పంపిణీ జరుగుతుంటుంది.

ప్రశ్న: బియ్యం తరలింపుపై ఇటీవల నమోదైన కేసులెన్ని?

జవాబు: అక్రమంగా బియ్యం తరలిస్తున్న వారిని గుర్తించి 72 కేసుల వరకు జిల్లా వ్యాప్తంగా నమోదు చేశాం. దీనిలో 12 కేసుల వరకు పరిష్కరించాం. ఈ మూడు మాసాల కాలంలో విజయవాడ, తిరువూరు, నందిగామ డివిజన్ల పరిధిలో అక్రమంగా తరలిస్తున్న 95 టన్నుల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నాం.

ప్రజా సమస్యలపై ఉద్యమ కార్యాచరణ

వరకూ పోరాడాలన్నారు. విద్యుత్ భారాలు, విద్యా రంగ సమస్యలపై ప్రజల్లో అవగాహన కల్పించి వారిని చైతన్యం చేయాలన్నారు. జూలై 9న జరిగే సార్వత్రిక సమ్మెను విజయవంతం చేసేందుకు కృషి చేయాలన్నారు.

27న జాతీయ సమైక్యతా ర్యాలీ

ఈ నెల 27న విజయవాడలో జాతీయ సమైక్యతా ర్యాలీ నిర్వహించాలని విస్తృత సమావేశం నిర్ణయించింది. ఇంకా జిల్లాలో పలుచోట్ల కూడా ఇటువంటి ర్యాలీలు చేపట్టాలని పిలుపునిచ్చింది. భూ సమస్యలు, మంచినీరు, కిడ్నీ మరణాల నివారణకు ఆసత్రి నిర్మాణం తదితర సమస్యలపై ఉద్యమించాలని, విద్యుత్ భారాలపై సంతకాల సేకరణ, స్టిక్కర్ల అంటించడం తదితర రూపాల్లో ఆందోళనలు చేపట్టాలని నిర్ణయించింది. ఈ సమావేశంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కె.శ్రీదేవి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పి.వి.ఆంజనేయులు, కోట కళ్యాణ్, ఎం.నాగేంద్ర ప్రసాద్, బోయి సత్యబాబు తదితరులు పాల్గొన్నారు.

చిరు వ్యాపారులపై ప్రతాపం

చిరు వ్యాపారం చేసుకుంటున్న వారిపై కక్షగట్టిన ప్రజాప్రతినిధులు, అధికారులు వారిని తొలగిస్తూ ఆ వృత్తే లేకుండా చేయడంతో చివరకు ఆయా కుటుంబాలు గడవటం కష్టంగా తయారైంది. లెనిన్ సెంటర్‌లో చెరుకురసం, పూలు, చెప్పులు, టిఫిన్ తదితర వివిధ రకాల చిరు వ్యాపారాలు చేసుకుంటున్న 53 షాపులను నెల రోజుల క్రితం విఎంసి అధికారులు తొలగించారు. ప్రజాప్రతినిధుల ఒత్తిడి మేరకు బీసెంట్ రోడ్డులో కూడా ట్రాఫిక్‌కు ఇబ్బందిగా ఉందంటూ ఇటీవల ట్రాఫిక్ పోలీసులు కొంత హడావుడి చేసి చిరు వ్యాపారులను భయభ్రాంతులకు గురి చేశారు. రోడ్డు మధ్యలో వ్యాపారాలు చేసుకుంటున్న పలువురిని అక్కడి నుంచి తొలగించే చర్యలకు పూనుకున్నారు. లెనిన్ సెంటర్ (విజయా పాలబూత్ ఎదురు, సిల్కో ఎదురుగా ఉన్న ఖాళీ స్థలాన్ని పార్కింగ్ ఫీజు వసూలు చేసుకోవడానికి అధికార పార్టీకి అనుకూలంగా ఉండే ఒకరు రూ.19 లక్షలకు ఓపెన్ ఆక్షన్‌లో చేజిక్కించుకున్నారు. తగినంత డబ్బు రావడం లేదని రాజకీయ అండతో విఎంసి అధికారులను లోబరుచుకొని లెనిన్ విగ్రహం చుట్టూ ఉన్న స్థలానికి కూడా పార్కింగ్ ఫీజు వసూలు చేసుకునే విధంగా అనుమతి తీసుకొచ్చినట్లు తెలిసింది. దీనిలో ఇదే ప్రాంతంలోని ఒక బట్టల షోరూమ్ యజమాని పాత్ర కూడా దాగి ఉన్నట్లు తెలిసింది. కాంట్రాక్టర్లు పార్కింగ్ ఫీజు వసూలు చేసుకునేందుకు వీలుగా అనాధిగా చిరు వ్యాపారాలు చేసుకుంటూ జీవిస్తున్న 53 మందిని విఎంసి అధికారులు అతి బలవంతంగా నెల క్రితం అక్కడి నుంచి తొలగించారు. బండ్లు మొత్తం తొలగించడంతో లెనిన్ సెంటర్ ఏరియాలో కూడా పార్కింగ్ ఫీజుల రూపంలో భారీ మొత్తంలో సదరు కాంట్రాక్టర్ సొమ్ము చేసుకుంటున్నట్లు విశ్వసనీయ సమాచారం.

ఇదే క్రమంలో పార్కింగ్ ఫీజు వసూలు చేసుకునే కాంట్రాక్టర్‌కు పలువురు చిరు వ్యాపారులు ఒక్కో బండికి ఏడాదికి రూ. 80 వేలు ఇచ్చేటట్లు, ప్రస్తుతం కొంత పైకం ముట్టచెప్పినట్లు తెలిసింది. ఇదే విధంగా బీసెంట్ రోడ్డులో కూడా గత మూడు మాసాల క్రితం కొంత డబ్బును వసూలు చేసి, 13 మంది చిరు వ్యాపారులను కొత్తగా రోడ్డు మధ్యలో అధికార పార్టీకి చెందిన నాయకులు ఏర్పాటు చేయించినట్లు సమాచారం. వీధి వ్యాపారులకు గుర్తింపుకార్డులు మంజూరు చేసి, బ్యాంక్ లోను సదుపాయం, వారి జీవనోపాధికి అన్ని విధాలుగా తోడ్పాటునివ్వాలని సుప్రీంకోర్టు తీర్పును కూడా పక్కన పెట్టేస్తున్న ప్రజాప్రతినిధులు, విఎంసి అధికారులు చివరకు వారి వృత్తిని దెబ్బతీసే విధంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా విఎంసి పరిధిలోని స్ట్రీట్ వెండర్స్ కమిటీ వీధి వ్యాపారులకు అధికార పార్టీ నేతల నుంచి రక్షణ కల్పించి, గుర్తింపుకార్డులు, బ్యాంక్ లోన్లు, అన్ని విధాలుగా అండదండలు ఇవ్వాలని సంబంధిత యూనియన్ నేతలు కోరుతున్నారు.

యోగాతో ఒత్తిడి దూరం : కలెక్టర్

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్

ప్రభుత్వ సేవలను ప్రజలకు అందించడంలో, రోజువారీ ఉద్యోగ బాధ్యతల్లో పని ఒత్తిడి ఎదురవడం సహజమని.. అలాంటి ఒత్తిడిని జయించి, మంచి ఫలితాలు సాధించేందుకు యోగా ఉన్నత మార్గమని, ఈ నేపథ్యంలో ప్రభుత్వ ఉద్యోగులు ప్రతిరోజూ కొంత సమయాన్ని యోగాచరణకు కేటాయించాలని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ సూచించారు. యోగాంధ్ర మాసోత్సవాల్లో భాగంగా ఆదివారం జిల్లా ఆయుష్ శాఖ, విజయవాడ నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో విజయవాడ బీఆర్‌టీఎస్ రోడ్డు శారదా కళాశాల వద్ద జరిగిన ప్రత్యేక యోగా కార్యక్రమంలో కలెక్టర్ లక్ష్మీశ ఎన్‌జీవో, ఐకాస నేతలు, ఉద్యోగులతో కలిసి పాల్గొని యోగాసనాలు వేశారు. అనంతరం కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ మాసోత్సవాల అయిదో రోజు, థీమ్ యోగా రెండో రోజున ప్రభుత్వ శాఖల ఉద్యోగులతో యోగా కార్యక్రమం నిర్వహించడం చాలా ఆనందంగా ఉందని.. ఉద్యోగ సంఘాల నేతలు తమ తమ పరిధిలోని ఉద్యోగులకు యోగా విశిష్టత గురించి వివరించి, జీవితాంతం ప్రతిరోజూ యోగాను ఆచరించేలా ప్రోత్సహించాలన్నారు. ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో యోగాను ఆచరించేలా చూడాలన్నారు. యోగాతో శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఆరోగ్యం దఢమవుతుందని, దీనివల్ల సరైన సమయంలో సరైన నిర్ణయాలు తీసుకోగల సామర్థ్యం వంటివి సొంతమవుతాయన్నారు. గౌరవ ముఖ్యమంత్రి మార్గనిర్దేశనంతో జిల్లాలో దాదాపు 15 లక్షల మందికి యోగాను నేర్పేందుకు వీలుగా యోగాంధ్ర కార్యక్రమాలు



యోగా కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశ

చేపడుతున్నామని, వీటిలో ఉద్యోగులు కీలక భాగస్వాములై విజయవంతం చేయాలని కలెక్టర్ లక్ష్మీశ సూచించారు. ఏపీ ఎన్‌జీవో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ.విద్యాసాగర్ మాట్లాడుతూ యోగా, ధ్యానం భారతీయ ఘన వారసత్వ సంపద అని, వాటిని నేడు ప్రపంచ వ్యాప్తంగా అనేక దేశాలు ఆచరిస్తున్నాయని, దైనందిన జీవితంలో యోగా, ధ్యానాన్ని భాగం చేసుకొని ముందడుగు వేయాలన్నారు. ఒత్తిడిని జయించేందుకు యోగా, ధ్యానం అనేవి గొప్ప మార్గాలని శతాబ్దాల కిందటే రుజువైందని, ఈ సంపదను భావితరాలకు అందించడంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. యోగాంధ్ర కార్యక్రమాలను విజయవంతం చేయడంలో ఏపీ ఎన్‌జీజీవో, ఐకాస కృషి చేయడం జరుగుతుందని తెలిపారు. పేద విద్యార్థులకు ఆర్టిస్టిక్ యోగాలో శిక్షణ ఇస్తూ, యోగాకు గుర్తింపు తెచ్చేందుకు కృషి చేస్తున్న ట్రైనర్ బి.శిరీష ముమ్ముందు ఇదేవిధమైన కార్యక్రమాలను నిర్వహించేందుకు వీలుగా రూ. 10 వేలు తక్షణ సహాయంగా ప్రకటిస్తున్నట్లు విద్యాసాగర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఎన్‌జీవో జిల్లా కార్యవర్గ అధ్యక్షులు డి.సత్యనారాయణ, సహాధ్యక్షులు వీవీ ప్రసాద్, కార్యదర్శి పి.రమేష్, నగర శాఖ అధ్యక్షుడు సీవీఆర్ ప్రసాద్, కార్యదర్శి షేక్ నజీరుద్దీన్, యోగాంధ్ర నోడల్ అధికారి, డీఎంహెచ్‌వో డా.ఎం.సుహాసిని, విజయవాడ నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ డి.చంద్రశేఖర్, జిల్లా ఆయుష్ యోగాంధ్ర నోడల్ అధికారి డా. వి.రాణి, మెడికల్ ఆఫీసర్ డా. వై.రత్న ప్రియదర్శిని, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా సివిల్స్ ప్రిలిమినరీ పరీక్ష

ప్రజాశక్తి-ఎడ్యుకేషన్

యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) నిర్వహించే సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ పరీక్ష ఆదివారం ప్రశాంతంగా ముగిసినట్లు ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ తెలిపారు. 10,381 మంది అభ్యర్థులకు ఉదయం పేపర్-1కు 5,716 (55.1 శాతం) మంది, మధ్యాహ్నం పేపర్-2కు 5,665 (54.6 శాతం) మంది హాజరయ్యారని తెలిపారు. ఈ సందర్భంగా విజయవాడ పీబీ సిద్ధార్థ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల పరీక్ష కేంద్రాన్ని కలెక్టర్ పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్‌టిఆర్ జిల్లాలో 25 పరీక్షా కేంద్రాల్లో ప్రిలిమినరీ పరీక్ష నిర్వహించామన్నారు. కలెక్టరేట్లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కంట్రోల్ రూమ్ ద్వారా పరీక్ష నిర్వహణను పర్యవేక్షించామన్నారు. పరీక్ష నిర్వహణకు సంబంధించి లోకల్ ఇన్‌స్పెక్టింగ్ కమ్ లైజన్ ఆఫీసర్, రూట్ అధికారులు, సూపర్‌వైజర్లు, స్ట్రాంగ్ రూమ్ భద్రతా సిబ్బంది తదితరులు సమన్వయంతో పనిచేసి పరీక్షను విజయవంతంగా నిర్వహించారన్నారు. అభ్యర్థులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా పరీక్ష కేంద్రాల్లో అన్ని మౌలిక వసతులు కల్పించినట్లు చెప్పారు. ఎటువంటి లోటుపాట్లు లేకుండా సజావుగా సక్రమంగా ప్రిలిమినరి పరీక్ష నిర్వహించిన అధికారులు, సిబ్బందికి కలెక్టర్ అభినందనలు తెలిపారు.

ఆటోనగర్‌లో సమస్యలను వెంటనే పరిష్కరించాలి

ప్రజాశక్తి - గుడివాడ : గుడివాడ ఆటోనగర్‌లో అనేక సమస్యలు ఉన్నాయని వెంటనే సమస్యలపై అధికారులు దృష్టి పెట్టి పరిష్కరించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్‌సిపి రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం స్థానిక సిఐటియు కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆర్‌సిపి రెడ్డి మాట్లాడుతూ ఆటోనగర్ పూర్తిగా సమస్యల మీద కొట్టుమిట్టాడుతుందని ప్రధానంగా ఆటోనగర్లో ఎన్నికల ముందు సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తామన్నారు కానీ నేటికి సీసీ కెమెరాలు ఏర్పాటు చేయలేదన్నారు. ఆటోనగర్లో కార్మికులు పనులు లేక ఇతర రాష్ట్రాలకు వలస వెళ్లి పోతున్నారని దాని రీత్యా ఆటోనగర్లో అనేక సమస్యలతో పాటు కార్మికులకు ఉపాధి కూడా లేని పరిస్థితి ఉంది కాబట్టి ఆటోనగర్లో ఉపాధి కల్పనకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు. అట్లాగే సబ్సిడీలు ఇచ్చి వ్యవసాయ పరికరాలు మీద ప్రభుత్వం ఆటోనగర్ కార్మికుల్ని ఆదుకోవాలని కోరుతున్నామన్నారు. అట్లాగే అక్కడ ప్రధానంగా త్రాగునీరు లేవని, టాయిలెట్స్ లేవని, ఆటోనగర్లో ఇంకా కార్మికుల సమస్యలు కూడా అనేకం ఉన్నాయన్నారు. ప్రభుత్వం జోక్యం చేసుకొని ఆటోనగర్ సమస్యలన్నీ తక్షణం పరిష్కరించాలని ఈ సందర్భంగా డిమాండ్ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఆటోనగర్ నాయకులు బొంతు వెంకటేశ్వరరావు, ఎం లక్ష్మీనారాయణ (లక్ష్మణ పెయింటర్) తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల సొసైటీ స్థలంలో షెడ్డు ఏర్పాటు

ప్రారంభించిన సిఇఒ ఎస్.వెంకట్రావు

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్



విజయవాడ రూరల్ మండలం నున్నలో ది విజయవాడ వర్కింగ్ జర్నలిస్ట్స్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కో ఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీకి ప్రభుత్వం కేటాయించిన భూమిలో సొసైటీని జర్నలిస్టులు ఏర్పాటు చేసుకున్న షెడ్‌ను ఆదివారం ఆ సొసైటీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఎస్.వెంకట్రావు ప్రారంభించారు. రిబ్బన్ కట్ చేసి షెడ్‌కు ప్రారంభోత్సవం చేశారు. ఈ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షులు చిగురుపాటి సతీష్, డైరెక్టర్లు స్వాతి, జిబిఎన్, వై.శ్రీనివాసరావు, ప్రసాద్, రాయప్పతోపాటు సొసైటీ సభ్యులు పాల్గొన్నారు. సుమారు 150 మంది జర్నలిస్టులు ఉన్న ఈ సొసైటీ సమస్యనుపరిష్కరించేందుకు గన్నవరం ఎంఎల్‌ఏ యార్లగడ్డ వెంకట్రావు తనవంతుగా కృషి చేస్తున్నారు. భూమిలో ఉన్న ఆక్రమణలను తహశీల్దారు సుగుణ ఆధ్వర్యాన తొలగించేందుకు సహకరించారు. అసెంబ్లీ సమావేశాల్లో కూడా ప్రత్యేకంగా సొసైటీ స్థలం సమస్యను ప్రస్తావించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కళ్యాణ్ దృష్టికి సమస్య వెళ్లేలా అసెంబ్లీలో మాట్లాడారు. ఇదే సమయంలో రాష్ట్ర సమాచారశాఖ మంత్రి కొలుసు పార్థసారది కూడా జర్నలిస్టుల సొసైటీ స్థలంలో ఇళ్ల నిర్మాణానికి తన సహకారం అందిస్తామని, అవసరమైతే.. ప్రభుత్వమే ఇళ్లు కట్టించే అంశాన్ని పరిశీలించి, సీఎంకు వివరిస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వం నుంచి సానుకూలంగా స్పందన వస్తుందని జర్నలిస్టులు ఆశగా ఎదురుచూస్తున్నారు. ఈ నేపథ్యంలోనే ఎంఎల్‌ఏ యార్లగడ్డ వెంకట్రావు, మంత్రి కొలుసు పార్థసారది, ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ, తహశీల్దార్ సుగుణ సహకారంతో సొసైటీ భూమిలో చిన్న షెడ్‌ను ఏర్పాటు చేసుకున్నారు.

ప్రజాశక్తి
జిల్లా వార్తలు 3
సోమవారం 26 మే 2025

యోగాంధ్రను విజయవంతం చేయాలి

- జిల్లా ఇన్చార్జి కలెక్టర్ గీతాంజలి శర్మ

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : యోగాంధ్ర కార్యక్రమంలో జిల్లా ప్రజలందరూ భాగస్వాములై విజయవంతం చేయాలని జిల్లా ఇన్చార్జి కలెక్టర్ గీతాంజలి శర్మ ఒక ప్రకటనలో కోరారు. వచ్చే జూన్ 21వ తేదీన 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవం రోజున విశాఖ పట్నంలో జరిగే కార్యక్రమాల్లో భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పాల్గొంటున్నారన్నారు. అదే సమయంలో జిల్లాలో పెద్ద ఎత్తున ప్రజలందరూ యోగాంధ్ర కార్యక్రమంలో పాల్గొనుటకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేస్తూ ఉందన్నారు. గ్రామ వార్డు సచివాలయాల సిబ్బంది ఇంటింటికి తిరిగి యోగాంధ్ర కార్యక్రమం గురించి ప్రజలందరికీ తెలియజేసి వారి పేర్లను యోగాంధ్ర యాప్ లో నమోదు చేయాలని ఇప్పటికే సూచించామన్నారు. ఆప్రక్రియ ముమ్మరంగా జరుగుతోం దన్నారు. ప్రజలందరూ సిబ్బందికి సహకరించి వచ్చే జూన్ 21వ తేదీన జరిగే అంతర్జాతీయ యోగా దినోత్సవం లో పెద్ద ఎత్తున పాల్గొనాలన్నారు. అంతేకాకుండా జిల్లా అధికారులు వారి కార్యాలయపు ఉద్యోగులందరికీ యోగాంధ్ర యాప్ https://yogandhra.ap.gov.in/#/home/yoga లో పేర్లు నమోదు చేసుకునేలా చొరవ చూపాలన్నారు. మండల స్థాయి మాస్టర్ ట్రైనర్లను యోగా ప్రోటోకాల్ పై శనివారం డిఎంహెచ్ఓ కార్యాల యంలో, ఆదివారం జడ్పీ కన్వెన్షన్ హాలులో న్యూఢిల్లీలోని యోగా శిక్షణ సంస్థ తో పాటు టి వో టి ల ద్వారా శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. మండల కేంద్రాల్లో ఒక అనువైన ప్రదేశాన్ని గుర్తించి అక్కడ మాస్టర్ ట్రైనర్ల ద్వారా గ్రామస్థాయి ట్రైనర్లకు యోగ శిక్షణ తరగతులు నిర్వహించేందుకు వీలుగా ఏర్పాట్లు చేయాలన్నారు. ఈనెల 27వ తేదీ నుండి 31వ తేదీ వరకు షెడ్యూల్ ప్రకారం ఉదయం 7 గంటల నుండి 8 గంటల వరకు ఎంపిక చేసిన నిర్ణీత ప్రదేశాల్లో మాస్టర్ ట్రైనర్లు గ్రామస్థాయి ట్రైనర్లకు శిక్షణ ఇస్తారన్నారు. గ్రామాల్లో స్థానికంగా ఉన్న యోగ సంఘాల శిక్షకులను, యోగ నిర్వహించే యోగ శిక్షకులను, ఆసక్తి ఉన్న క్రీడాకారులు, వ్యాయామ ఉపాధ్యాయులను గ్రామస్థాయి ట్రైనర్లుగా శిక్షణ పొందేందుకు గుర్తించాలన్నారు. ప్రజల్లో యోగ పై అవగాహన కలిగించేందుకు ఈ నెల 27వ తేదీన పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించడం జరుగుతుందన్నారు.



జిల్లాలో గుర్తించిన 4 ప్రముఖ పర్యాటక కేంద్రాల్లో యోగా కార్యక్రమాలు పెద్ద ఎత్తున నిర్వహిస్తా మన్నారు. ఇందులో భాగంగా ఈనెల 31వ తేదీన మంగినపూడి బీచ్ లో, వచ్చే జూన్ నెల 6 వ తేదీన కూచిపూడి లోని శ్రీ సిద్ధేంద్ర యోగి కళాక్షేత్రంలో, జూన్ 13 వ తేదీన ప్రముఖ గౌతమ బుద్ధ క్షేత్రమైన ఘంటసాల లో, జూన్ 19 వ తేదీన మోపిదేవి లోని శ్రీ సుబ్రమణ్యేశ్వర స్వామి దేవస్థానం ప్రాంగణంలో ప్రత్యేకంగా యోగా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. వచ్చే జూన్ 13వ తేదీన జిల్లాస్థాయిలో జూనియర్లకు, యువతకు, సీనియర్లకు యోగా పోటీలు నిర్వహిస్తా మన్నారు. ఇందులో భాగంగా యోగ పై వ్యాసరచన, గీతాలు, చిత్రలేఖనము, యోగా బందము, షార్ట్ ఫిలిం, ఫోటోగ్రఫీ, క్విజ్, గోడపత్రాలు, నినాదాలు, స్కిట్, రంగోలి వంటి పోటీలు నిర్వహిస్తామన్నారు. అందులో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి బహుమతి ప్రధానం చేయడం జరుగుతుందన్నారు. ఈ యోగా కార్యక్రమాల్లో యోగా గురువులు, యోగ శిక్షకులు, యోగ స్వచ్ఛంద కార్యకర్తలు, ఆసక్తి కలిగిన వారు, యోగ సాధకులు, సాధారణ ప్రజలు అందరూ విరివిగా పాల్గొని జయప్రదం చేయాలన్నారు.

ఎనిమిది మంది జూదరుల అరెస్టు

ప్రజాశక్తి-మొవ్వ : పామర్రు సిఐ వి సుభాకర్ పర్యవేక్షణలో ఆదివారం కూచిపూడి ఎస్సై కేఎన్ విశ్వనాథ్ తన సిబ్బందితో చినముత్తేవి గ్రామ పొలాల్లో జూదం ఆడుతున్న ఎనిమిది మంది వ్యక్తులను పట్టుకుని కేసు నమోదు చేశారు. వారి వద్ద నుంచి మొత్తం 35,200. రూపాయలు నగదు స్వాధీనం చేసుకున్నారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న వాహనాలు



పామర్రులో ఆటలు ఆడుతున్న చిన్నారులు

విద్యార్థులకు ఆటల పోటీలు

ప్రజాశక్తి-పామర్రు : విద్యార్థులు చిన్ననాటి నుండే శారీరక దారుఢ్యం కలిగి ఉండాలని పామర్రు శాఖా గ్రంధాలయం అధికారి ఎం.ఝాన్సీ రాణి అన్నారు. వేసవి శిక్షణ శిబిరాల్లో భాగంగా పామర్రు శాఖా గ్రంధాలయంలో విద్యార్థులకు ఆదివారం జనరల్ నాలెడ్జ్ పై అవగాహన కల్పించారు.అనంతరం పరుగులు పోటీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శారీరక దారుఢ్యం వల్ల మంచి ఆరోగ్యంతోపాటు బుద్ధి వికాసం కలుగుతాయి అన్నారు.ఈ పోటీలో గెలుపొందిన వారికి శిక్షణ కార్యక్రమం ముగింపు సభలో బహుమతులు అందజేస్తామన్నారు. మండల పరిధిలోని గోల్వేపల్లిశాఖా గ్రంధాలయంలో వేసవి విజ్ఞాన శిబిరాలలో భాగంగా విద్యార్థులచే మ్యూజికల్ చైర్స్ ఆటల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి వి.నాగ సురేష్ తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-గుడ్లవల్లేరు** : జంతువుల పట్ల దయ కలిగి ఉంటే అవి మనకు ఎంతో మేలు చేస్తాయని గ్రంథాలయ అధికారిని టి వాణి అన్నారు. మండల కేంద్రమైన గుడ్లవల్లేరు గ్రేట్ 2 శాఖ గ్రంధాలయంలో వేసవి విజ్ఞాన శిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ శిబిరంలో జంతు ప్రేమ అనే కథను సరదా కథలు అనే పుస్తకం నుండి విద్యార్థులకు చదివి వినిపించారు. అనంతరం పిల్లలకు ఉల్లాసంగా, ఉత్సాహంగా వివిధ ఆటలు పోటీలను నిర్వహించారు.

ఉపాధ్యాయ, విద్యార్థుల నిష్పత్తి పాటించాలి : యుటిఎఫ్



వినతిపత్రం అందిస్తున్న యుటిఎఫ్ నాయకులు

ప్రజాశక్తి- కలక్టరేట్ (కృష్ణా) : పాఠశాలల పునర్ వ్యవస్తీకరణ అనంతరం ఉపాధ్యాయ విద్యార్థుల నిష్పత్తి కచ్చితంగా పాటించాలని యు టి ఎఫ్ . కష్ణాజిల్లా శాఖ ఆద్వర్యంలో ఆదివారం జిల్లా విద్యాశాఖ అధికారి పివిజె.రామరావు కి వినతి పత్రం అందించారు. ఈ నెల 21 ఉపాధ్యాయ సంఘాలతో జరిపిన చర్చల్లో ఉన్నత పాఠశాలలో సెక్షన్ 54 వద్ద కాకుండా 49 తదుపరి రెండో సెక్షన్ అమలు చేస్తామని ముఖ్య కార్యదర్శి హామీ ఇచ్చారని గుర్తు చేశారు. కానీ కష్ణా జిల్లాలో కొన్ని ఉన్నత పాఠశాలలలో 54 వద్ద రెండో సెక్షన్ అమలు చేస్తున్నారని కాబట్టి జరిగిన ఒప్పందం ప్రకారం ఉపాధ్యాయ విద్యార్థుల నిష్పత్తి కచ్చితంగా పాటించా లన్నారు. ఉన్నత పాఠశాలలలో 49 మంది విద్యార్థులు దాటిన తర్వాత రెండో సెక్షన్ అమలు చేయాలని సూచిం చారు. ఆదేవిధంగా ప్రస్తుతము పాఠశాలల పునర్వ్యవ స్థీకరణ అనంతరం జిల్లాలో , కేడర్ల వారీగా ప్రమోషన్ పోస్టుల సంఖ్య, ఖాళీల వివరాలు, సర్ ప్లస్ ఉపాధ్యాయుల సంఖ్య వివరాలు తెలియజేయాలని కోరారు. డిఇఓ ని కలసిన వారిలో యూటీఎఫ్ కష్ణా జిల్లా శాఖ అధ్యక్ష కార్యదర్శులు ఎండి షౌకత్ హుస్సేన్, బి కనకారావు, రాష్ట్ర కార్యదర్శి కెఏ ఉమామహేశ్వరరావు, జిల్లా గౌరవాధ్యక్షులు జే లెనిన్ బాబు, జిల్లా సహాధ్యక్షురాలు జె ఝాన్సీ, జిల్లా కార్యదర్శులు సిహెచ్ రాజా శ్రీధర్, పి పద్మాంజలి, టీ నాగేశ్వరరావు ఉన్నారు.

బందరులో కార్డెన్ సెర్చ్

ప్రజాశక్తి మచిలీపట్నం అర్బన్ : జిల్లా ఎస్పీ ఆర్ గంగాధర్ రావు ఆదేశాల మేరకు మచిలీపట్నం నగరంలో ఆదివారం ఉదయం గోపాల్ నగర్ టెంపుల్ కాలనీ ప్రాంతం లో పోలీసులు క్షుణ్ణంగా కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎటువంటి పత్రాలు లేని 25 వాహనాలు గుర్తించి పోలీసులు సీజ్ చేశారు. ఈ ఆపరేషన్ కార్డెన్ సెర్చ్ లో 100 మంది అధికారులు పాల్గొన్నారు. నగర డిఎస్పి సిహెచ్ రాజా, సిఐ అబ్దుల్ నభి , పరమేశ్వరరావు మచిలీపట్నం ఎస్ఐ నాగరాజు కతి వెన్నె ఎస్సై పైడి బాబు, బంటుమిల్లి ఎస్ఐ గణేష్ కుమార్ పాల్గొన్నారు.

9న బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహావిష్కరణ



ప్రజాశక్తి-గన్నవరం : మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ విగ్ర ఆవిష్కరణ ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర అధ్యక్షులు మందా కష్ణ చేతుల మీదుగా జూన్ 9న గన్నవరం నియోజక వర్గంలోఎని చింతకుంటలో జరుగుతుందని మహాజన సోషలిస్ట్ పార్టీ రాష్ట్ర నాయకులు కోట.దానియేలు తెలిపారు. స్థానిక గన్నవరం టౌన్ అంబేద్కర్ పార్క్ లో కష్ణాజిల్లా ఎమ్మార్పీఎస్ అధికార ప్రతినిధి కోట కష్ణ మోహన్ అధ్యక్షతన ఎమ్మార్పీఎస్ ఎంఎస్పి ఎంఈఎఫ్ సమావేశం జరిగింది. ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు మంద వేణు మాదిగ, కష్ణాజిల్లా ఎం ఇ ఎఫ్ అధ్యక్షులు దేవరపల్లి విక్టర్ బాబు, ఎం ఈ ఎఫ్ గన్నవరం నియోజకవర్గ ఇన్చార్జ్ దేవరపల్లి ఏసుబాబు, ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు రామ్ దాని మాదిగ పాల్గొన్నారు.

టిడిపి మహానాడుకు సైకిల్ యాత్ర



ప్రజాశక్తి-అవనిగడ్డ : కడపలో జరగనున్న మహానాడుకు కోడూరు నుండి సైకిల్ యాత్ర చేపట్టిన మునేశ్వరరావుకు అవనిగడ్డ టిడిపి నాయకులు ఆదివారం స్వాగతం పలికారు. 60 ఏళ్ల వయసులోనూ సైకిల్ ద్వారా మహానాడుకు బయలుదేరిన మునేశ్వరరావు స్ఫూర్తి దాత అని అవనిగడ్డ మండల పార్టీ అధ్యక్షులు యా సం చిట్టిబాబు తెలిపారు. ఆదివారం కోడూరు నుండి కడపకు బయలుదేరిన దూళిపూడి మునేశ్వరరావుకు అవనిగడ్డలో స్వాగతం పలికి సత్కరించారు. ఈ సందర్భంగా పండ్లు బహూకరించారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు గుడివాక శివరావు, టిడిపి ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు మాచవరపు ఆదినారాయణ, మాజీ వైస్ ఎంపీపీ లుక్కా వెంకట పిచ్చయ్య, టిడిపి జిల్లా కార్యదర్శి విశ్వనాథుని మురళీమోహన్ పాల్గొన్నారు.

వెంకయ్య మృతికి సంతాపం

ప్రజాశక్తి - పామర్రు : పామర్రు పంచాయతీ 17వ వార్డు సభ్యుడు, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు పామర్తి వెంకయ్య అనారోగ్యంతో మరణించారు. ఆయన పార్థివ దేహానికి ఆదివారం కృష్ణాజిల్లా ప్రాజెక్టు కమిటీ ఉపాధ్యక్షుడు వల్లూరుపల్లి గణేష్ ,తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు కుదరవల్లి ప్రవీణ్ చంద్ర, పంచాయితీ సర్పంచ్ కే.కస్తూరి, ఉప సర్పంచ్ బాల వెంకటేశ్వర్ రెడ్డి, 19వ వార్డు సభ్యుడు మంతెన రామాంజ నేయులు, పామర్రు పట్టణ టిడిపి అధ్యక్షుడు పరసా సుబ్రహ్మాణ్యం తదితరులు నివాళులర్పించారు.వెంకయ్య కుటుంబానికి తమ సంతాపం తెలిపారు.



కొండలమ్మను దర్శించుకున్న యాత్రికులు



ఎంఎల్ఎ కామినేనికి చిత్రపటం అందిస్తున్న అధికారులు



వెండిబిందె అందిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : జిల్లాలో ప్రసిద్ధి గాంచిన వేమవరం శ్రీ కొండలమ్మ అమ్మవారిని కైకలూరు శాసన సభ్యులు కామినేని శ్రీనివాస్ ఆదివారం దర్శించుకున్నారు. వారిని ఆలయ మర్యాదలకు స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయనను సత్కరించి అమ్మవారి చిత్రపటాన్ని ప్రసాదాలను ఆలయ కార్య నిర్వహణ అధికారి ఆకుల కొండల రావు అందజేశారు. అలాగే ఆదివారం సందర్భంగా సుమారు 25 వేల మంది యాత్రికులు అమ్మవారిని దర్శించుకుని అమ్మవారికి పాల పొంగళ్ళు సమర్పించి వారి వారి ముక్కుబడులను తీర్చుకున్నారు. ఆలయానికి విచ్చేసిన యాత్రికులకు ఎలాంటి అసౌక ర్యాలు కలగ కుండా ఏర్పాట్లు చేసినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి ఆకుల కొండలు తెలిపారు.

వెండి బిందె అందజేత : కొండలమ్మ అమ్మ వారికి కమలాపురం గ్రామానికి చెందిన తాడిశెట్టి రంగ మున్నార్ భ్రమరాంబ దంపతులు 1లక్ష 10 వేల రూపాయల విలువగల వెండి బిందెను ఆదివారం అమ్మ వారికి సమర్పించారు. వారిని ఈవో ఆకుల కొండలరావు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించి దాతలను సత్కరించారు.



ఇంటింటికీ తిరిగి తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తూ ప్రచారం చేస్తున్న హైస్కూల్ ఉపాధ్యాయులు, గ్రామపెద్దలు, తదితరులు

హైస్కూల్లో ప్రవేశాలపై ప్రచారం

ప్రజాశక్తి - వీరులపాడు : మండలంలోని దొడ్డ దేవరపాడు గ్రామంలో ఈ విద్యా సంవత్సరం నూతనంగా అప్‌గ్రేడ్ అవుతున్న హైస్కూల్లో ప్రవేశాల నమోదు ప్రక్రియ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. గ్రామంలోని ఎస్‌సి కాలనీలో ఇంటింటికి తిరిగి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలను వివరించి వారి పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించేలా ఎస్ఎంసి సభ్యులు, గ్రామ పెద్దలు ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు డి.హరి ప్రసాద్ స్కూల్ విద్యా కమిటీ చైర్మన్ స్వర్గం శ్రీహరి గ్రామ ప్రముఖులు అప్పసాని పుల్లారావు గ్రామ పెద్దలు, బోజడ్ల దుర్గారావు, పల్లె కంటి బాబు, ఉపాధ్యాయులు జి.కోటయ్య తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చదివించాలని భవిష్యత్తులో ఉత్తమ విద్యార్థులుగా తీర్చిదియటానికి కృషి చేస్తామన్నారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో విద్యార్థులు సామాజిక స్థితిగతులు సామాజిక సేవ విస్మరిస్తున్నారని విద్యార్థులకు సమాజ సేవ పట్ల అవగాహన కల్పించాలని తల్లిదండ్రులకు సూచించారు.



వీరాస్వామిన్‌ని సన్మానిస్తున్న దృశ్యం

వీరాస్వామిన్‌కి సన్మానం

ప్రజాశక్తి - నందిగామ :

నందిగామ మండలం రాఘవపురం గ్రామ టిడిపి నాయకులు కార్యకర్తలు కలిసి, రెండోసారి నందిగామ మండల టిడిపి అధ్యక్షుడిగా ఎన్నికైన టిడిపి అధ్యక్షుడు వీరంకి వీరాస్వామిన్‌ను శాలువాలతో సత్కరించి, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ టిడిపి నాయకులు మాజీ పిఎసిఎస్ అధ్యక్షులు చెన్నుపాటి సాంబశివ రావు, యూనిట్ ఇన్చార్జ్ గరివిడి సురేష్, గ్రామ టిడిపి అధ్యక్షులు పెసరమల్లి సుబ్రహ్మణ్యం, పెసరమళ్ళి యేసు, తదితరులు పాల్గొన్నారు.

హరికృష్ణ అక్రమ అరెస్టుకు ఖండన

ప్రజాశక్తి - వత్సవాయి :

బిసి సామాజిక వర్గానికి చెందిన ఉప్పుతల హరికృష్ణను అర్ధరాత్రి అక్రమంగా అరెస్టు చేయడాన్ని వైసిపి బిసి సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బత్తుల రామారావు ఖండించారు. మండల కేంద్రమైన పెనుగంచిప్రోలులోని సత్రం సెంటర్ బీసీ కాలనీలో బత్తుల రామారావు నివాసంలో ఆదివారం సాయంత్రం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ హరికృష్ణను అర్ధరాత్రి అక్రమంగా అరెస్ట్ చేసిన పోలీసులు టిడిపి నాయకుల సొంత వెహికిల్స్‌లో తీసుకురావడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పోలీసులు రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు చేస్తూ ప్రతిపక్ష పార్టీల నాయకులను కార్యకర్తలను వేధింపులకు గురిచేస్తూ థర్డ్ డిగ్రీ ప్రయోగిస్తూ రాక్షసుల్లా వ్యవహరిస్తున్న తీరు దుర్మార్గం అన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి జిల్లా బిసి సెల్ ఉపాధ్యక్షులు చేని రాంబాబు నియోజకవర్గ వాణిజ్య విభాగం అధ్యక్షులు దేరంగుల శ్రీనివాసరావు, పార్టీ పెనుగంచిప్రోలు మండల సోషల్ మీడియా కోఆర్డినేటర్ నల్లబోతుల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

గోతులు... గులక రాళ్ళు...

అధ్వానంగా గొట్టుముక్కల - నరసింహారావుపాలెం రోడ్డు



పగిలిన రోడ్డు..



గులకరాళ్ళు లేచిన రోడ్డు...

ప్రజాశక్తి - కంచికచర్ల : కంచికచర్ల మండలం గొట్టుముక్కల నుండి వీరులపాడు మండలం నరసింహారావు పాలెంకు వెళ్లే అందమైన రోడ్డు ఇది. కూటమి ప్రభుత్వం వచ్చినప్పుడు వైసిపి ప్రభుత్వం హయాంలో శిథిలావస్థకు చేరిన రోడ్లను 2025 సంక్రాంతికి అందంగా తీర్చిదిద్దుతామని ప్రకటించారు. బహుశా కూటమి నాయకులు నందిగామ నియోజకవర్గంలో ఇటువంటి అధ్వాన రోడ్లు ఉంటాయని వాటిని బాగు చేయాలని ఆలోచన లేదేమో..?

కంచికచర్ల, వీరులపాడు మండలాలకు అనుసంధానమైన గొట్టుముక్కల నుండి నరసింహారావుపాలెం వెళ్లి నాలుగు కిలోమీటర్ల ఈ రోడ్డు ఎక్కడికక్కడ రాళ్ళు లేచి గుంతలు పడి కనీసం పాదచారులు సైతం నడవడానికి వీలులేని పరిస్థితి ఉందంటే ఆశ్చర్యం లేదు. నరసింహారావు పాలెం గ్రామం ముందు సిసి రోడ్డు నిర్మించారు. ఈ సిసి రోడ్డు వేసినప్పుడే నెర్రెలు కొట్టాయి. 2010లో నిర్మించిన ఈ సిసి రోడ్డు ఇప్పుడు నెర్రెలు వచ్చేశాయి. ఈ గాడుల్లో కలుపు గడ్డి మొలిచి ఇక్కడ రోడ్డు ఉందా అనే అనుమానం కలుగుతుంది. పొలిమేర దగ్గర నుండి గొట్టుముక్కల వైపు ఉన్న బీటీ రోడ్డు పగిలిపోయి ఎక్కడికి అక్కడ రాళ్ళు లేచిపోయాయి. ఈ రోడ్డు అంతా గుంతల మయంగా మారింది. గత్యంతరం లేని పరిస్థితుల్లో ఈ రెండు గ్రామాల మధ్య ప్రజలు ప్రయాణిస్తున్నారు. కంచికచర్ల నుండి నరసింహారావు పాలెం గ్రామానికి జగన్నాధపురం నుండి వెళ్లాలంటే దాదాపు 12 కిలోమీటర్ల దూరం ఉంది. కంచికచర్ల నుండి నరసింహారావు పాలెం వెళ్లాలంటే అలానే జుజ్జూరు వెళ్లాలన్న ఈ మార్గం అతి దగ్గరది. వయా గొట్టుముక్కల కేవలం ఎనిమిది కిలోమీటర్ల దూరం మాత్రమే. 2010లో అప్పటి పార్లమెంట్ సభ్యులు లగడపాటి రాజగోపాల్‌ను మాజీ మంత్రి వసంత నాగేశ్వరరావు సిఫార్స్ చేసి కంచికచర్లకు గొట్టుముక్కల మీదుగా నరసింహారావు పాలేనికి రోడ్డు మంజూరు చేయించారు. ఆ తర్వాత గొట్టుముక్కల నుండి నరసింహారావు పాలెం వెళ్లాలంటే ఈ రోడ్డుపై నరకం చూడాల్సిందే. గత్యంతరం లేక నరసింహారావు పాలెం గ్రామ వాస్తవ్యులు దూరమైనప్పటికీ మధిర రోడ్డులో వయాజగన్నాధపురం మీదుగా వెళ్తున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాది గడుస్తున్నా ఈ రోడ్డుపై మాత్రం దృష్టి కేంద్రీకరించలేదు. రెండు మండలాలకు అనుసంధానమైన గొట్టుముక్కల నుండి నరసింహారావుపాలెం రోడ్డు మరమ్మతులు వెంటనే చేపట్టాల్సిన ఆవశ్యకత ఉంది. ఇదే రోడ్లో నరసింహారావుపాలెం దగ్గర నుంచి జుజ్జూరు తోటమూలలకు బీటీ రోడ్డు నిర్మించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. ఇప్పటికైనా నందిగామ నియోజకవర్గ ప్రతినిధి స్పందించి కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీని నెరవేర్చాలని ఈ రోడ్లు నిర్మించాలని ఈ ప్రాంత ప్రజలు ముక్తకంఠంతో కోరుకుంటున్నారు.

బోరు నిర్మాణ పనులు ప్రారంభం



పనులు ప్రారంభించిన వరలక్ష్మి

ప్రజాశక్తి - నందిగామ : నందిగామలో అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ మండవ వరలక్ష్మి అన్నారు. పట్టణ పరిధిలోని మూడో వార్డు జండా చెట్టు వద్ద, హనుమంతు పాలెం గ్రామంలో నూతన నిర్మాణ బోరు పనులకు కలిసి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ పట్టణ పరిధిలో గత ప్రభుత్వ పాలనలో నిరుపయోగంగా పడి ఉన్న బోరు మరమ్మతు పనులను పూర్తి చేశామని ప్రస్తుత నీటి ఎద్దడి కలిగి ఉన్న ప్రాంతాల్లో దాదాపు 24 లక్షల రూపాయల వ్యయంతో నూతనంగా 21 బోరు పాయింట్లను నిర్మిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్ష,కార్యదర్శులు ఏచూరి రాము, కాసర్ల లక్ష్మీనారాయణ, డిసి చైర్మన్ రాటకొండ చంద్రశేఖర్, మూడవ వార్డు ఇన్చార్జి షేక్ ఇమామ్ జానీ,కూటమి నాయకులు, స్థానిక ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



యుటిఎఫ్ కార్యాలయంలో ఉపాధ్యాయ బదిలీల దరఖాస్తులు

ప్రజాశక్తి - నందిగామ :

ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ నందిగామ డివిజన్ కార్యాలయంలో ఉపాధ్యాయుల బదిలీల అప్లికేషన్ పెట్టేందుకు యుటిఎఫ్ నాయకులు సేవలందిస్తున్నారు. నందిగామ మండల కోశాధికారి జి.లక్ష్మీనారాయణ, జిల్లా ఆడిట్ కన్వీనర్ వెంకటేశ్వరరావు, జిల్లా కౌన్సిలర్ జక్కనాచార్యులు, రాష్ట్ర కౌన్సిలర్ జె.గంగరాజు ఈ నెల 27 వరకు యుటిఎఫ్ కార్యాలయంలో నిరంతరం అందుబాటులో ఉంటూ ఉపాధ్యాయులకు సేవలందిస్తున్నట్లు నాయకులు తెలిపారు.

ఎడ్ టెక్ ద్వారా విద్యా సమాచారం తెలుసుకోవచ్చు

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : ఎడ్యుకేషన్ టెక్నాలజీ ద్వారా విద్యా రంగంలో మార్పులను తెలుసుకోవచ్చని ఎడ్ టెక్ సంస్థ ప్రతినిధి ఎం.రాజశేఖర్ తెలిపారు. నగరంలోని సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలను తెలిపారు. ప్రభుత్వ విద్యా వ్యవస్థలో వ్యక్తిగత అనుకూల అభ్యసనను విస్తృతంగా వాడుకలోకి తెచ్చేందుకు ఏర్పడిన మార్గదర్శక సంస్థ పిఎఎల్ వర్క్స్ అన్నారు. దీని ద్వారా ఎడ్‌టెక్ ఆవిష్కర్తలను, విద్యారంగంలో పనిచేస్తున్న స్వచ్ఛంద సంస్థలను, పరిశోధన నిపుణులను, ఎకోసిస్టమ్ ఎనేబులర్లను, దాతృత్వ సంస్థలను, ప్రభుత్వరంగ సంస్థలను ఒకచోట చేర్చి, విభిన్న నైపుణ్యాలను ఏకంచేసి, ఎడ్యుకేషన్ టెక్నాలజీ (ఎడ్‌టెక్)ని తెలియచేస్తామన్నారు. దీనిని సమర్థవంతంగా ఉపయోగించడం ద్వారా, ప్రతి విద్యార్థి అభ్యసన ఫలితాలను మెరుగుపర్చడానికి ప్రయత్నిస్తుందన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

విజయవాడ : రైల్వే మిక్సిడ్ హైస్కూల్ సత్యనారాయణపురం 1998-99 బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయంగా కలుసుకున్నారు. ప్రస్తుతం ఆ పాఠశాల తీసేసి రైల్వే ట్రైనింగ్ సెంటర్ నిర్వహిస్తున్నప్పటికీ అనుమతితో అక్కడే నిర్వహించుకోవడం విశేషం. ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకొని యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఆ పాత జ్ఞాపకాలు నెమరు వేసుకొని విద్యార్థి అనుభూతిని పొందారు. అందరూ కలిసి ఆశ్రమంలో పిల్లలకు భోజనం పంపిణీ చేశారు. కట్టుపల్లి వేణు, జి.దుర్గాప్రసాద్, డి.దుర్గాప్రసాద్, పి.రాజేష్, కె.మోసెస్ రాజశేఖరం, జి.నారాయణ, పి.సతీష్, పి.చంద్రశేఖర్ మూర్తి, బాలకిషోర్, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



చిట్టినగర్ టేనర్ మెమోరియల్ స్కూల్ 1983-84 బ్యాచ్



ఆత్మీయంగా కలుసుకున్న రైల్వే మిక్సిడ్ హైస్కూల్ 1998-99 బ్యాచ్ విద్యార్థులు

టిఎంహెచ్ స్కూల్ పూర్వ విద్యార్థుల కలయిక

ప్రజాశక్తి - వన్‌టౌన్ : స్థానిక చిట్టినగర్‌లోని టేనర్ మెమోరియల్ హైస్కూల్ 1983 – 84 సంవత్సరం టెన్త్ క్లాస్ విద్యార్థుల ఆత్మీయ కలయిక కార్యక్రమం ఆదివారం కలరా హాస్పిటల్ వద్దనున్న ఎస్‌వి కన్వెన్షన్ హాల్లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆనాడు స్కూల్లో చదువుకున్న విద్యార్థులు కలుసుకొని తమ హైస్కూలు చదువుల ముచ్చట్లను చెప్పుకున్నారు. ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకుని కుటుంబ సభ్యుల వివరాలను పంచుకున్నారు. ఇకపై ఏర్పాటు చేసే గెట్ టుగెదర్ కార్యక్రమాల్లో కలుసుకొని తమ స్నేహాన్ని కలకాలం కొనసాగించాలని తీర్మానించుకున్నారు. ఈ సందర్భంగా హైస్కూల్ మిత్రుల్లో ఒకరైన చిన్ని కృష్ణ తన గానామృతంతో స్నేహం మీద పలు పాటలను పాడి తన చిన్ననాటి స్నేహితులను అలరించారు. అనంతరం అంతా కలిసి గ్రూప్ ఫోటో దిగి కేరింతలు కొట్టారు. ఈ కార్యక్రమాన్ని ఎంతో వ్యయ ప్రయాసలకు ఓర్చి నిర్వహించిన మిత్ర బృందం శంకర్, చిన్ని కృష్ణ, సురేష్ బాబు, విజయ తదితరులకు స్నేహితులంతా అభినందనలు తెలిపారు.



వీరపనేని గూడెం వెళ్లే రోడ్డు కోతకు గురైన దృశ్యం



కొత్తగూడెం వద్ద కోసుకుపోతున్న పోలవరం కాలవ

కోతకు గురవుతున్న

కొత్తగూడెం-వీరపనేనిగూడెం రోడ్డు

ప్రజాశక్తి-గన్నవరం : అకాల వర్షాలతో కొత్తగూడెం.. వీరపనేని గూడెం రోడ్డు ధ్వంసమైంది. పోలవరం కట్ట, రోడ్డు కోతకు గురవడంతో ప్రమాదకరంగా మారింది. ఏదైనా ప్రమాదం జరిగితే కాలవలోకి కొట్టుకుపోవడమేనని రైతులు చెబుతున్నారు. రైతులు, విద్యార్థుల బాధలు వర్ణాతీతంగా ఉన్నాయి. చిక్కవరం నుంచి కొత్తగూడెం మీదుగా వీరపనేని గూడెం వెళ్లాలంటే ఇదే ప్రధాన రహదారి. కో-ఆపరేటివ్ బ్యాంకుకు రైతులు వెళుతుంటారు. విద్యార్థులు చదువు కోసం వెళతారు. వ్యవసాయ పనులకు కూలీలు వెళతారు. రోడ్డు దారుణంగా దెబ్బ తినడంతో ప్రమాదం అంచున వీరి ప్రయాణం సాగుతుంది. గత ఐదేళ్లుగా పాడైపోయిన రోడ్డు ఈ నెలలో కురిసిన భారీ వర్షాలకు మరింత ఛిద్రమయింది. పెద్ద పెద్ద గుంతలు పడి, రాళ్లు తేలి చోదకుల వాహనాలు అదుపు తప్పి ప్రమాదాలకు గురవుతున్నారు. ఒక్కోచోట అసలు రోడ్డెక్కడుందో వెతుక్కోవాల్సిన పరిస్థితి నెలకొంది. లోతట్టు ప్రాంతాల్లోని రోడ్లపై నీరు నిల్వ ఉండి వాహనదారులకు ప్రయాణం ప్రాణసంకటంగా మారింది. రాత్రివేళ పరిస్థితి మరీ ఘోరంగా ఉంటోందని, ఎక్కడ పడిపోతామోనని జనాలు భయాందోళనలు చెందుతున్నారు. రోడ్ల మరమ్మతులు చేపట్టాలని ఈ గ్రామాల వాసులు కోరుతున్నారు.

రోడ్డును బాగు చేయాలి.. సిపిఎం

చిక్కవరం నుంచి వీరపనేనిగూడెం వెళ్లే ప్రధాన రహదారిని అభివద్ధి చేయాలని సిపిఎం నాయకులు కొలుసు శ్రీమన్నారాయణ డిమాండ్ చేశారు. పోలవరం కాలువ పక్కనే ఉన్న ఈ రోడ్డు కోతకు గురవుతుందని,. మట్టి కూడా మాయం అవుతుందన్నారు.. రైతులు కో..ఆపరేటివ్ బ్యాంకులకు రోజు వెళ్లడానికి రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి కోతకు గురవుతున్న రోడ్డును బాగు చేయడానికి చర్యలు తీసుకోవాలన్నారు.



పంచాయతీ కార్యదర్శుల సంఘం ఉపాధ్యక్షుడిగా వెంకటరమణ ఎన్నిక

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : గుడివాడ డివిజన్ పంచాయతీ కార్యదర్శుల సంఘం ఉపాధ్యక్షుడిగా వడ్లమన్నాడు పంచాయతీ కార్యదర్శి బలగం వెంకటరమణ ఎన్నికయ్యారు. గుడివాడ మండల పరిషత్ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన గుడివాడ డివిజన్ యూనిట్ల కార్యవర్గ ఎన్నికల్లో రమణ ఎన్నికయ్యారు. సంయుక్త కార్యదర్శిగా గుడ్లవల్లేరు పంచాయతీ ఉద్యోగులు డి సుస్మిత, ఈసీ నెంబర్‌గా కె నాగరాజు ఎన్నికయ్యారు. వీరికి మండల పంచాయతీ కార్యదర్శులు ఏజేయల్ నరసింహారావు, విజయ్, వెంకటేశ్వరరావు సిహెచ్ రాజేష్, ఎలీషా రావు, జయలక్ష్మి పలువురు అభినందనలు తెలిపారు



సమావేశమైన పూర్వ విద్యార్థులు

ఉత్సాహంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తితోట్లవల్లూరు : తోట్లవల్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థులు ఆదివారం ఉత్సాహంగా కలుసుకున్నారు. 1996 -97 సంవత్సరంలో పదవ తరగతి చదివిన విద్యార్థులు కలుసుకొని తమకు విద్యను బోధించిన ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. వివిధ రంగాలలో వివిధ ప్రాంతాలలో ఉన్న వారంతా ఆత్మీయ సమ్మేళనంగా కలుసుకొని ఒకరినొకరు పరిచయాలు చేసుకున్నారు. కుశల కబుర్లు చెప్పుకున్నారు.అప్పటి విద్యార్థి దశ అల్లర్లు, చిలిపి చేష్టలు మధుర జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూ సరదాగా గడిపారు. గొరిపర్తి సూర్యనారాయణ, జంపాన రాము,మురాల బాలకష్ణ డొక్కు చిన్ని, ఆముదాలపల్లి రమేష్, పెనుమత్స రాధిక తదితరులు పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనానికి ప్రత్యేకమైన శ్రద్ధ తీసుకున్నట్లు తెలిపారు. అప్పటి విద్యార్థులంతా కుటుంబాల సమేతంగా కలిసి ఆహ్లాదంగా గడిపారు.

పేదల కోసం పనిచేసిన సీతారామయ్య : సిపిఎం

ప్రజాశక్తి-గన్నవరం : పేదల కోసం పనిచేసిన సీతారామయ్య జనం గుండెల్లో జీవించే ఉంటారని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కళ్ళం వెంకటేశ్వరరావు అన్నారు. గన్నవరం మండలం సూరంపల్లి గ్రామంలో సిపిఎం గ్రామ శాఖ ఆధ్వర్యంలో రాళ్లకట్ట సెంటర్ లో పార్టీ సీనియర్ నాయకులు దివంగత మల్లంపాటి సీతారామయ్య ప్రథమ వర్ధంతి సభ జరిగింది. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. గ్రామంలో పేద ప్రజల సమస్యలపై సుదీర్ఘ కాలం పాటు పనిచేసిన సీతారామయ్య లేని లోటు తీరనిది అన్నారు. పార్టీ ఎడల అచంచలమైన విశ్వాసంతో జీవితమంతా ఎర్రజెండా నీడలో కొనసాగారని చెప్పారు. పేదలకు ఇళ్ల స్థలాలు ఇప్పించడంలో, వ్యవసాయ భూమి ఇప్పించడం కోసం అనేక పోరాటాలు చేశారని గుర్తు చేశారు. ఆయన ఆశయాల సాధన కోసం పాటుపడతామన్నారు. తొలుత సీతారామయ్య చిత్రపటానికి పలువురు నాయకులు పూలమాలలు వేసి జోహార్లు అర్పించారు. ఈ కార్యక్రమంలో మల్లంపల్లి ఆంజనేయులు, బెజవాడ తాతబ్బాయి, రమేష్, శ్రీను, కళ్ళం రాంబాబు, ఏసుదాసు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కళ్లం వెంకటేశ్వరరావు

నేడు కలెక్టరేట్‌లో 'మీకోసం'

ప్రజాశక్తి- కలక్టరేట్ (కృష్ణా) : ఈ నెల 26వ తేదీ సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఉదయం 10:30 గంటల నుండి ప్రజా సమస్యల పరిష్కార వేదిక -మీకోసం (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమం నిర్వహించి ప్రజల నుండి అర్జీలు స్వీకరిస్తామనిజిల్లా ఇంచార్జ్ కలెక్టర్ గీతాంజలి శర్మ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంతో పాటు అన్ని డివిజన్, మండల కేంద్రాల్లో, మునిసిపల్ కార్యాలయాల్లో కూడాఈ కార్యక్రమం జరుగుతుందని, ఈ విషయాన్ని గమనించి తమ ఫిర్యాదులను సమీపంలోని మండల కార్యాలయాలు లేదా మున్సిపల్ కార్యాలయాలలో అందజేయవచ్చున్నారు. అలాగే ప్రజా సమస్యల పరిష్కార వేదిక మీకోసం కాల్ సెంటర్ నంబర్ 1100 కు ప్రజలు ఎవరైనా సరే కాల్ చేసి అర్జీ నమోదు చేసుకోవడంతోపాటు వారి అర్జీ స్థితిని తెలుసుకోవచ్చున్నారు.

నిత్యాన్నదానానికి విరాళం

ప్రజాశక్తి-మోపిదేవి : మోపిదేవి గ్రామంలో ఉన్న శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి నిత్యాన్నదానం పథకానికి విరాళాలు వెల్లువలా వస్తున్నాయి. విజయవాడకు చెందిన తాటికుంట జగదీష్ , తేజస్వి దంపతులు వారి కుమారుడు చి స్రిహాన్ పేరు మీద లక్ష రూపాయలు ఆదివారం అందజేశారు. డిప్యూటీ కమిషనర్, ఆలయ కార్యనిర్వాహణ అధికారి దాసరి శ్రీరామ వరప్రసాదరావు దాతలను ఆలయ మర్యాదలతో సత్కరించి, తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ అధికారులు తిమ్మన రామకృష్ణ పాల్గొన్నారు.



విరాళం అందజేస్తున్న దృశ్యం

భారత సైన్యం పోరాటం అభినందనీయం

ప్రజాశక్తి-బంటుమిల్లి : బంటుమిల్లి మండలం లోని గుండా బత్తుల ఆంజనేయులు స్మారక భవనంలో సమైక్యత సదస్సు ఆదివారం నిర్వహించారు. రైతు సంఘం జిల్లా కార్యదర్శి గౌరిశెట్టి నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సదస్సులో ఎల్ఐసి యూనియన్ కృష్ణా-గుంటూరు జిల్లాల కార్యదర్శి జి కిషోర్ కుమార్ పాల్గొని ప్రసంగించారు. కాశ్మీర్‌లోని పహల్గాంలో పాకిస్తాన్ ఉగ్రవాదులు బరితెగింపుకు ధీటుగా భారత సైన్యం పోరాడిన తీరు భారతీయులుగా గర్వపడాలని అన్నారు. అయితే దీనిని మతాలకు కులాలకు అతీతంగా చూడాలని , భిన్నత్వంలో ఏకత్వాన్ని కాపాడాలని అన్నారు. పాకిస్తాన్ ఉగ్ర దాడిని భారత ప్రజలంతా ముక్తకంఠంతో ఖండించారని, అది అందరం గుర్తుంచుకోవాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కార్మికులు, రైతులు, వ్యవసాయ కార్మికులు, చిరు వ్యాపారస్తులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జి.కిషోర్‌కుమార్

ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి- కలక్టరేట్ (కృష్ణా) : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం కృష్ణా జిల్లా శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా పి.రాము, తోట.చంద్రశేఖర్ లు తిరిగి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సంఘ జిల్లా శాఖ కార్యవర్గ ఎన్నిక ఆదివారం స్థానిక జి.కన్వెన్షన్ హాలులో జరిగింది. సహాధ్యక్షులుగా జి. శ్రీనివాస్ రావు, ఆర్గనైజేషన్ కార్యదర్శిగా యస్. రాంబాబు, ఉపాధ్యక్షులుగా కె.వి.లో కేశ్వరరావు, యస్.వి.వి.రామారావు, కె.కోటేశ్వరరావు, సిహెచ్.వి .సత్యనారాయణ రావు,వి. సత్యనారాయణ, సహాయ కార్యదర్శులుగా జి. రామకష్ణ, సిహెచ్. యస్.ఆర్. పవన్ కుమార్, సిహెచ్. బ్రాహ్మందబాబు, యం. బాలాజీ, పి.ప్రవీణ్ కుమార్, సాస్ హుస్సేన్, యండి.సలీం, కోశాధికారిగా బి.సురేష్ నాయక్ బాబు ఎన్నికైనట్లు గుళ్లిపల్లి నాగసాయి తెలిపారు. సహాఎన్నికల అధికారిగా కిషోర్ వ్యవహరించారు. నూతన కమిటీకి జిల్లాలోని ఆయా కార్య వర్గాలు అభినందనలు తెలిపాయి.ఈ ఎన్నికలకు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి ఉద్యోగులు పెద్ద సంఖ్య లో హాజరైనట్టు తెలిపారు.ఈ సందర్భంగా జూన్ 5 తేది న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కౌన్సిల్ నిర్వహించే చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నూతన కార్యవర్గం పిలుపు నిచ్చింది. అలాగే ఈ ఏకగ్రీవ ఎన్నిక ఉద్యోగుల సంఘటిత శక్తిని, ఐకమత్యాన్ని మరోసారి చాటి చెప్పిందన్నారు.అదే విధంగా రానున్న రోజుల్లో ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి, వారి హక్కుల పరిరక్షణకు, ప్రభుత్వంతో సమన్వయం చేసుకుంటూ ముందుకు వెళతామని నూతన కార్యవర్గం స్పష్టం చేసింది.



నూతన కార్యవర్గం



దుకాణాల ద్వారా రేషన్ పంపిణీపై హర్షం

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : రేషన్ డోర్ డెలివరీ విధానాన్ని రద్దుచేసి ఎప్పుడు కావలిస్తే అప్పుడు కార్డు దారుడు రేషన్ షాప్ ద్వారా రేషన్ తీసుకునే విధానాన్ని పునఃప్రారంభించిన సిఎం చంద్రబాబుకు పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌కు జిల్లా, మండలం డీలర్లు ధన్యవాదాలు తెలిపారు. ఇబ్రహీంపట్నం మండలం తుమ్మలపాలెంలో ఉన్న కార్యాలయంలో జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు ఇందిరా ఆధ్వర్యంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పి.శివప్రసాద్ కేక్ కట్ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కార్డు దారులకు మరింత సమర్థవంతంగా సేవలందించాలని రేషన్ డీలర్లకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మండల డీలర్లు, కమిటీ నాయకులు, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

రేషన్ వెహికల్స్ రద్దును పున:సమీక్షించాలి

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : ఇంటింటికీ బియ్యం పంపిణీ చేసే రేషన్ వెహికల్స్ రద్దును పున:సమీక్షించాలని వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి తన్నీరు నాగేశ్వరరావు అన్నారు. పట్టణంలోని జగ్గయ్యపేట నియోజకవర్గ వైసిపి కార్యాలయంలో నాగేశ్వరరావు మాట్లాడుతూ మాజీ సిఎం వైఎస్.జగన్ మీద ఉన్న కోపాన్ని, కక్షసాధింపులను పేద ప్రజల మీద చూపిస్తే సహించేది లేదన్నారు. ఇంటింటికీ నిత్యావసర సరుకులు పంపిణీ చేసే ఎండియు వాహనాలను కొనసాగించాలన్నారు. ఎండియు వాహనాల రద్దును పునరాలోచన చేసుకోపోతే భవిష్యత్తులో తీవ్ర పరిణామాలు ఎదుర్కొంటారన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఎస్టీ సెల్ అధ్యక్షులు బాణావత్ రాజు, పట్టణ ప్రధాన కార్యదర్శి పింగళి నరసింహారెడ్డి, విజయవాడ కనకదుర్గమ్మ అమ్మవారి దేవస్థాన మాజీ డైరెక్టర్ నంబూరి రవి, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత ఈత శిక్షణకు సర్టిఫికెట్లు అందజేత

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : డ్రీమర్ స్విమ్మింగ్ అసోసియేషన్ జగ్గయ్యపేట వారు పాలేరులో నిర్వాహించిన వేసవి సెలవుల ఉచిత ఈత శిక్షణా తరగతుల్లో కొత్తగా 78 మంది బాల బాలికలు, మహిళలు పాల్గొన్నారు. ఈ ఉచిత ఈత శిక్షణా తరగతులు కోచ్ దంపతులు పొట్టా బత్తిన పాండురంగారావు, లక్ష్మి దంపతుల ఆధ్వర్యంలో డ్రీమర్ స్విమ్మింగ్ అసోసియేషన్ వారు పాలేరులో నిర్వహించారు. శిక్షణా తరగతులు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆదివారం ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన డాక్టర్ సామినేని దీపక్ కుమార్ చేతుల మీదుగా మొదటి విడతగా 25 మందికి సర్టిఫికెట్స్ అందజేశారు. ఈ శిక్షణా తరగతులు కార్యక్రమానికి అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ కలలి నరేష్, అడ్డగోట్టం రమేష్ బాబు అదనపు కోచ్‌లుగా ప్రత్యేక సహాయ సహకారాలు అందించారు. ఈ కార్యక్రమంలో ప్రెసిడెంట్ మందడపు శ్రీనివాసరావు, టీం మేనేజర్ అన్నంనేడి కళ్యాణ్, కోశాధికారి పరిణయం రమాదేవి, అడ్డగోట్టం రమేష్ బాబు, కోచ్ పొట్టాబత్తిన సందీప్ తదితరులు పాల్గొన్నారు.

రైతు శ్రేయస్సుకు కృషి

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : పట్టణంలో గల ప్రాంతీయ పశువైద్యశాలలో ఆదివారం పశువుల దాణా 50శాతం సబ్సిడీపై నియోజకవర్గంలో 500 మంది రైతులకు 50 కేజీల బ్యాగ్ చొప్పున 500 మంది రైతులకు ఎంఎల్ఎ శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) చేతుల మీదుగా లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా తాతయ్య మాట్లాడుతూ రైతు శ్రేయస్సే కూటమి ప్రభుత్వ ధ్యేయమని అన్నారు. కూటమి ప్రభుత్వం రైతుల అభివృద్ధికి కట్టుబడి ఉందని అన్నారు. రాబోయే కాలంలో ఈ అవకాశాన్ని పశుపోషకులు ఉపయోగించుకొని అత్యధిక పాల దిగుబడి పొందాలని సూచించారు. రైతులకు ఏ కష్టం వచ్చినా మీ వెన్నంటే ఉంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ భవానీ ప్రసాద్, డాక్టర్ లక్ష్మీప్రసన్న, డాక్టర్ శ్రీను నాయక్, డాక్టర్ మురళీకృష్ణ, రావూరి శ్రీను, గుమ్మ వెంకటేష్, పశుపోషకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న గ్రంథాలయ వేసవి శిక్షణా తరగతులు

విజయవాడ : చిత్తరంజన్ గ్రేడ్-2 శాఖా గ్రంథాలయం సత్యనారాయణపురంలో ఆదివారం వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా రిసోర్స్ పర్సన్స్ చే భగవద్గీత శ్లోకాలు, నీతి కథలు, మ్యాథమెటిక్స్, స్పోకెన్ ఇంగ్లీష్‌లలో విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. రెండోరోజు రోబో శిక్షణా తరగతుల్లో చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. తదుపరి ఇడ్యూఇనో రోబోట్స్ ప్రైవేట్ కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ షేక్ బాజీ బాషా మినీ రోబోస్ ఎలా తయారు చేయాలో విద్యార్థులకు అవగాహన కల్పించి శిక్షణ ఇచ్చారు. తదుపరి చిన్నారులు సొంతగా రోబోలను తయారు చేశారు. విద్యార్థులందరూ ఎంతో ఉత్సాహంగా పాల్గొని ఎన్నో కొత్త విషయాలు తెలుసుకున్నామని సంతృప్తి వ్యక్తం చేశారు. గ్రంథాలయ అధికారి పి.సంపత్ కుమార్ రోబోల వల్ల కలిగే ఉపాధి అవకాశాల గురించి మాట్లాడుతూ ప్రస్తుతం కంప్యూటర్ల వల్ల ఉపాధి అవకాశాలు ఎలా లభిస్తున్నాయో అలాగే రాబోయే రోజుల్లో రోబోల వల్ల కూడా ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉండవచ్చన్నారు. తదితర విషయాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్స్ రిటైర్డ్ రైల్వే ఉద్యోగి కె.శేష బాల, రిటైర్డ్ బ్యాంక్ మేనేజర్ టి.సాయి సుబ్బన్న, రిటైర్డ్ ఉద్యో గి ఆర్ శ్రీనివాసులు గ్రంథాలయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : పట్టణంలోని గ్రేడ్ 1 శాఖ గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన తరగతుల్లో భాగంగా ఆదివారం మొదటిగా విద్యార్థులకు పుస్తక పఠనం చేయించారు. అనంతరం గ్రంథాలయాధికారి ఆలేటి ప్రభ ఛత్రపతి శివాజీ దేశ స్వతంత్రం కోసం పోరాడిన వీరుడు గురించి చదివి వివరించారు. డి.రామలక్ష్మీపతి మెడిటేషన్ చేయించి యోగాసనం వేయించారు. తదనంతరం విద్యార్థులకు మ్యూజికల్ చైర్స్‌పోటీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో


జగ్గయ్యపేటలో...


మైలవరంలో...


తిరువూరు గ్రంథాలయంలో ఆటలాడుతున్న విద్యార్థులు

గ్రంథాలయ సిబ్బంది రమేష్, రాము పాల్గొన్నారు. **మైలవరం :** స్థానిక శాఖ గ్రంథాలయంలో విద్యార్థులకు వేసవి శిక్షణా శిబిరంలో భాగంగా ఆదివారం స్థానిక లీలావతి హైస్కూల్ ఉపాధ్యాయురాలు ఎస్‌కె సైదాబీ భాషాభాగాల గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది, విద్యార్థిని విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు. **కంచికచర్ల :** కంచికచర్ల శాఖ గ్రంథాలయంలో ఆదివారం వేసవి విజ్ఞాన తరగతులు నిర్వహించారు. డ్రాయింగ్ టీచర్ సర్వేశ్వరరావు విద్యార్థులకు కూరగాయల చిత్రాలు గీయించారు. పాటలు నేర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారి అల్లూరి రామచంద్రుడు తదితరులు పాల్గొన్నారు. **తిరువూరు :** తిరువూరు ప్రథమ శ్రేణి గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణా తరగతుల్లో


విజయవాడ చిత్తరంజన్ గ్రంథాలయంలో డ్రాయింగ్ నేర్చుకుంటున్న చిన్నారులు

విద్యార్థులకు ఆదివారం వివిధ రకాల పోటీలు నిర్వహించారు. కథల పుస్తకాలు చదివించటం నీతి కథలు చెప్పించటం, చిత్రలేఖనం వేయించడం చేశామని గ్రంథాలయ అధికారి పద్మ తెలిపారు. వక్తృత్వ పోటీలు, మ్యూజికల్ చైర్స్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశామన్నారు.

ప్రసన్నాంజనేయులు సేవలు మరువలేనివి

ప్రజాశక్తి - వన్‌టౌన్ : సిండికేట్ బ్యాంక్ కాలనీ అభివృద్ధికి ప్రసన్నాంజనేయులు సేవలు మరువలేనివని లైన్స్ క్లబ్ ఆఫ్ విజయవాడ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ ఎన్‌వి రావ్ అన్నారు. స్థానిక కెఎల్ రావు నగర్ లైన్స్ క్లబ్ ఆఫ్ విజయవాడ స్మైల్స్ ఆఫీస్‌లో చేదేళ్ల ప్రసన్నాంజనేయులు సంతాప సభ కార్యక్రమం ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమానికి క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ ఎన్‌వి.రావ్ అధ్యక్షత వహిస్తూ మాట్లాడారు. ప్రసన్నాంజనేయులు మృతి ఈ ప్రాంతానికి తీరనిలోటని, ఆయన బహుముఖ సేవా తత్పరుడని అన్నారు. స్మైల్స్ లైన్స్ సర్వీస్ ఛారిటబుల్ ట్రస్టుకు వసతిని ఏర్పాటు చేసి, కొన్ని వందల మంది మహిళలు కుట్టు ట్రైనింగ్, నేర్చుకోవడానికి అవకాశం కల్పించారని అన్నారు. ఎవరికి ఎటువంటి ఇబ్బంది వచ్చినా, తన చేతనైన సహాయాన్ని చేసేవారిని, సిండికేట్ బ్యాంక్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్‌లో కోశాధికారిగా కృషి చేశారని, ఈ ప్రాంతంలో ఇన్ని మొక్కలు నాటడానికి, బ్యాంక్ కాలనీ స్థలాలు రిజిస్ట్రేషన్‌కి ఎంతో సేవలందించారన్నారు. ఈ కార్యక్రమంలో క్లబ్ నాయకులు సూర్యారావు,


ప్రసన్నాంజనేయులు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న డాక్టర్ ఎన్.వి రావ్, తదితరులు

ఎస్.ఈశ్వరరావు, వై.నారాయణస్వామి, క్లబ్ అధ్యక్షులు నమ్మి అప్పారావు, క్లబ్ కోశాధికారి ఎన్.డివి.ప్రసాద్, సిండికేట్ బ్యాంక్ కాలనీ, ఆఫీస్ బేరర్స్ భూషణ్‌రావు, డాక్టర్ వెంకటరత్నం, మల్లికార్జున్‌రావు, వాకర్స్ క్లబ్ నాయకులు గుగ్గిలం విజయ్ కుమార్, స్థానిక మిత్రులు నందిగామ రమేష్, ఒగ్గు మురళీకృష్ణ, కారంశెట్టి మల్లికార్జున్ తదితరులు పాల్గొని నివాళులర్పించారు.

చదువుల తల్లి కావ్యారెడ్డికి సత్కారం

ప్రజాశక్తి - నందిగామ : చందర్లపాడు మండలం కాసరబాద గ్రామంలో చదువుల తల్లి కావ్యారెడ్డికి సత్కారం చేశారు. విప్పల శివారెడ్డి హరిణి దంపతుల కుమార్తె విప్పల కావ్యారెడ్డి 10వ తరగతిలో అత్యధిక మార్కులు 588 మార్కులు సాధించినందుకు గానూ కాసరబాద గ్రామంలో ఉన్న అక్షర జ్ఞానం లేని వ్యక్తి కోట యాకోబు మంచి మనస్సుతో కావ్యారెడ్డిని అభినందిస్తూ సన్మానించారు. కావ్యారెడ్డి గృహం వద్దనే ఏర్పాటు చేశారు. గోకర్ల నరసింహారావు సభాధ్యక్షత వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంఆర్‌పిఎస్ ఆంధ్ర వ్యవస్థాపక అధ్యక్షులు దొండపాటి సుధాకర్ మాదిగ పాల్గొని మాట్లాడుతూ చిన్నారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కోడెల కృష్ణ కుమారి, జనసేన చందర్లపాడు మండల అధ్యక్షులు వడ్డెలి సుధాకర్, టిడిపి నాయకులు భూతుకూరి శ్రీనివాసరెడ్డి, కోడెల ప్రసాద్, వైసిపి నాయకులు నరాల తిరుమల రెడ్డి, కొప్పుల వెంకటేశ్వరరెడ్డి, బిజెపి నాయకులు భూతుకూరి వెంకటేశ్వరరెడ్డి, నడుకుదురు నాని, నంద్యాల వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


కావ్యాను సత్కరిస్తున్న దృశ్యం

మఠం శివాలయం పునర్నిర్మాణానికి విరాళం

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : పట్టణ సమీపంలోని పాలేటివొడ్డున గల మఠం శివాలయం పునర్నిర్మాణానికి యాత్రికులు నక్కాని వెంకట సత్య రంగనాయకులు జ్ఞాపకార్థం ఆయన భార్య రమాదేవి, కుమార్తె సంయుక్తంగా ఆలయ కమిటీ సభ్యులకు రూ.1,00,116 లు విరాళంగా అందజేశారు.

కళ్లజోళ్లు పంపిణీ

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : మండలంలోని మల్కాపురం గ్రామంలో ఇటీవల జయప్రద ఫౌండేషన్ చైర్మన్ తొండపు దశరథ జనార్ధన్ సహకారంతో ఉచిత నేత్ర వైద్య శిబిరంలో కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో కంటి లోపాలు గుర్తించిన 68 మందికి ఆదివారం కళ్ళజోళ్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి సమన్వయ కమిటీ సభ్యులు నెట్టెం శివరాం, వైఎస్ రెడ్డి, గ్రామ నాయకులు గుత్తా నాగేశ్వరరావు, వనం చలమయ్య, కళ్యాణం భాస్కరరావు, ఆత్తులూరు కృష్ణారావు, గంగవరపు వెంకటేశ్వరరావు, బట్టు వెంకయ్య, ఆల్లిక కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కడపలో మహానాడు విజయవంతం చేయాలి

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : 27, 28, 29 తేదీల్లో కడపలో జరగబోయే మహానాడులో పాల్గొని విజయవంతం చేయాలని టిడిపి నాయకులు, కార్యకర్తలు వివిధ హోదాల్లో ఉన్న సభ్యులకు మండల ప్రధాన కార్యదర్శి సాకిరి వెంకట నర్సయ్య పిలుపునిచ్చారు.

జగనన్న కాలనీల్లో సమస్యలు పరిష్కరించాలి : సిపిఎం

ప్రజాశక్తి-మొవ్వ : జగనన్న కాలనీలో సరైన సదుపాయాలు లేక కాలనీవాసులు ఇబ్బంది పడుతున్నారనీ, ప్రభుత్వం వారు వెంటనే స్పందించి కాలనీలలో సమస్యలను వెంటనే పరిష్కరించాలని మొవ్వ మండల సిపిఎం కార్యదర్శి శీలం నారాయణరావు డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ మొవ్వ మండలం పెదసనగల్లు గ్రామంలో జగనన్న కాలనీ కింద 90 మందికి 2.30 ఎకరాల భూమి ఇచ్చారన్నారు. . ఇంతవరకు లెవెలింగ్, విద్యుత్ సరఫరా, మెయిన్ రోడ్, మంచినీటి పైప్ లైన్, తదితర మౌలిక సదుపాయాలు కల్పించలేదని, , ఒక్కరు మాత్రమే కాలనీలో ఇంటి నిర్మాణం పూర్తి చేశారన్నారు. అలాగే కోసూరు గ్రామంలోని జగనన్న కాలనీలో రోడ్లు, విద్యుత్ సరఫరా, లెవెలింగ్, వాటర్ పైప్ లైన్ కూడా కల్పించలేదని, వర్షాకాలంలో కోసూరు జగనన్న కాలనీలో మురుగునీరు నిల్వ ఉండి ఇబ్బంది పడుతున్నారన్నారు. పెదపూడి పంచాయతీలు 238 పట్టాలిచ్చారని, వందమంది ఇంటి నిర్మాణాలు చేసి 40 మంది నివాసం ఉంటున్నారన్నారు. అంతర్గత రోడ్లు, మెయిన్ రోడ్డు, మెయిన్ లైన్ కి కరెంటు సరఫరా ఇవ్వలేదని, , వీధిలైట్లు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. వెంటనే ప్రభుత్వం స్పందించి మండలంలో జగనన్న కాలనీ నెలకొని సమస్యలపై దృష్టి పెట్టి పరిష్కరించాలని కోరారు.

డాక్టర్ మాగంటికి సత్కారం

ప్రజాశక్తి - గుడివాడ : స్థానిక 9వ వార్డులోని మానవత స్వచ్ఛంద సేవా సంస్థ గుడివాడ శాఖ కార్యాల యంలో ఆ శాఖ మాస సేవా కార్యక్రమాల సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశంలో మానవత సంస్థ ఆధ్వర్యంలో చేస్తున్న సేవలను వివరించిన అనంతరం ప్రముఖ వైద్యులు గుడివాడ ఇండియన్ మెడికల్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ మాగంటి శ్రీనివాస్‌ను సత్కరించి, జ్ఞాపికలను అందించారు. ఈ సందర్భంగా మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ఉమ్మడి కృష్ణాజిల్లా అధ్యక్షురాలు దండమూడి జయలక్ష్మి, గుడివాడ శాఖ చైర్మన్ పిన్నమనేని వేణుగోపాలరావు, అధ్యక్షులు అన్నపురెడ్డి గోపీరెడ్డి, కార్యదర్శి నందమూరి పద్మజలు మాట్లాడుతూ ఉన్నత విలువలతో వైద్యరంగంలో పదిమందికి సహాయం చేస్తూ విలువగా శిబిరాలు నిర్వహించడమే కాకుండా, అనేక స్వచ్ఛంద సంస్థల్లో ఉత్సాహంగా పాల్గొంటూ సామాజిక అంశాల్లో మాగంటి శ్రీనివాస్ చేస్తున్న సేవలను కొనియాడారు. అనంతరం వైద్య ఖర్చుల నిమిత్తం కొలుసు రాజు అనే వ్యక్తికి సంస్థ ఆధ్వర్యంలో 5వేలు, విద్యార్థి రాకేష్ ప్రోత్సాహం నిమిత్తం మరో 5వేల చెక్కును డాక్టర్ మాగంటి అందజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ దండమూడి సీతారామస్వామి, బొగ్గవరపు తిరుపతయ్య, దుద్దు చిన్న, సభ్యులు పాల్గొన్నారు.



మహనీయుల బాటలో నడుద్దాం : వంగవీటి రాధా

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : పేద వర్గాల వారి అభివృద్ధికి మహనీయుల చూపిన బాటలో నడుద్దామని మాజీ ఎమ్మెల్యే వంగవీటి రాధాకృష్ణ అన్నారు. గుడ్లవల్లేరు వైఎస్సార్ బ్రిడ్జిపై శ్రీకృష్ణ దేవరాయలు, వంగవీటి మోహనరంగా, ఎస్వీ రంగారావు విగ్రహాల సముదాయాన్ని గుడ్లవల్లేరు ఎస్ఈఆర్ఎం విద్యా సంస్థల చైర్మన్ వల్లభనేని వెంకట్రావు చేతుల మీదుగా కాపు సంఘ నాయకుల ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి ప్రారంభించారు. అలాగే కైకాల సత్యనారాయణ భార్య కైకాల నాగేశ్వరమ్మ చేతుల మీదుగా కౌతవరంలో గ్రామస్తులు ఏర్పాటు చేసిన కైకాల విగ్రహాన్ని వంగవీటి ప్రారంభించారు. కైకాల సోదరుడు లక్ష్మీనారాయణ, కుమారులు కైకాల రామారావు, నాగేశ్వరరావు కూడా పాల్గొన్నారు. కైకాల విగ్రహంతో పాటు వంగవీటి మోహనరంగా విగ్రహాన్ని కూడా ఆవిష్కరించారు. చిత్రం గ్రామంలో వీఎం రంగా విగ్రహాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో గుడివాడ



విగ్రహావిష్కరణలో పాల్గొన్న రాధా, వెనిగండ్ల

ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, రాష్ట్ర గిడ్డంగుల చైర్మన్ రావి వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ మండల నాయకులు పాలేటి చంటి, మిరియాల రాజేంద్రప్రసాద్, బాడిగ నాని, ఏఎంసీ చైర్మన్ పొట్లూరి రవి, వల్లభనేని కృష్ణప్రసాద్ పాల్గొన్నారు.

మహానాడును విజయవంతం చేయాలి : టిడిపి



అవనిగడ్డలో మాట్లాడుతున్న బొబ్బా గోవర్ధన్

ప్రజాశక్తి-అవనిగడ్డ : కడపలో ఈనెల 27 నుండి 29 వరకు జరగనున్న టిడిపి మహానాడు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆ పార్టీ నాయకులు పిలుపునిచ్చారు. ఆదివారం అవనిగడ్డ లోని నియోజకవర్గ టిడిపి కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు ఎన్ఆర్ఐ బొబ్బా గోవర్ధన్, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి ఏఎంసీ చైర్మన్ కొల్లూరు వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత మొదటిసారిగా జరుగుతున్న మహానాడు కార్యక్ర మానికి నియోజకవర్గం నుంచి పార్టీ శ్రేణులు వెళ్లేందుకు వీలుగా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. అవనిగడ్డ నుంచి సోమవారం సాయంత్రం లగ్జరీ బస్సులు అందుబాటులో ఉంచ తున్నామని చెప్పారు. అదేవిధంగా 29వ తేదీన జరిగే బహిరంగ సభ కోసం నియోజకవర్గంలోని ఆరు మండలాల నుంచి ప్రత్యేకంగా బస్సులు అందుబాటులో ఉంచుతున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో కోడూరు నాగాయలంక మండల పార్టీ అధ్యక్షులు బండే శ్రీనివాసరావు, మెండు లక్ష్మణరావు, కర్రె సుధాకర్, పర్చురి దుర్గాప్రసాద్ పాల్గొన్నారు

మహానాడుకు తరలి రండి: యార్లగడ్డ

ప్రజాశక్తి-గన్నవరం : మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ జయంతి సందర్భంగా ప్రతి ఏటా జరిగే మహానాడు కార్యక్రమాన్ని ఈనెల 27వ తేదీ నుండి కడపలో మూడు రోజులపాటు నిర్వహిస్తున్నామని ఈ కార్యక్రమానికి రాష్ట్రవ్యాప్తంగా టిడిపి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలిరావాలని ప్రభుత్వ విప్ గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు పిలుపునిచ్చారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రెండు తెలుగు రాష్ట్రాల్లో తెలుగుదేశం పార్టీ మహానాడు కార్యక్రమం తెలుగుదేశం పార్టీ శ్రేణులకు ఒక పండుగ లాంటిదని అన్నారు.

మొరాయించిన ఆర్టీసి బస్సు

ప్రజాశక్తి-మోపిదేవి : మార్గమధ్యంలో అర్ధాంతరంగా మళ్లీ అవనిగడ్డ డిపో బస్సు ఆగిపోయింది. ఆదివారం ఉదయం విజయవాడ నుంచి అవనిగడ్డ బయలుదేరిన కరకట్ట రూటు బస్సు నడకుదురు వద్ద ముందుకు కదలనని మొరాయించింది. బస్సు బాడీ వెనక టైర్లపై ఆనుకుని పెద్ద పెద్ద శబ్దలు చేస్తూ బస్సు ముందుకు కదలని పరిస్థితి ఎదురైనట్లు ప్రయాణికులు చెబుతున్నారు. మార్గమధ్యంలో ఆగిపోయే బస్సులను అధికారులు డిపో లోనే ఉంచాలని సర్వీస్ కు ఇచ్చి



బస్సు ఆగిపోవడంతో రోడ్డుపైనే ప్రయాణీకులు

ఇబ్బందులకు గురిచేయొద్దని ప్రయాణీకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

సహకార బ్యాంకులను నిర్వీర్యం చేస్తున్న ప్రభుత్వాలు

- విశాఖ బ్యాంకు డైరెక్టర్ కెఎస్ఆర్ మూర్తి

ప్రజాశక్తి-గన్నవరం : కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నూతన పాలసీల పేరుతో సహకార బ్యాంకులను నిర్వీర్యం చేస్తున్నాయని విశాఖ బ్యాంకు డైరెక్టర్ కె.ఎస్. ఆర్ మూర్తి విమర్శించారు. ఆదివారం గన్నవరం కొత్తపేటలో రోటరీ ఆడిటోరియంలో విశాఖ బ్యాంక్ గన్నవరం విశాఖ వార్షిక మహాసభ నిర్వహించారు. మూర్తి మాట్లాడుతూ.. దేశంలో సహకార రంగంలోనే 1850 పైన సహకార బ్యాంకులో పని చేస్తున్నాయని అన్నారు. దాదాపు 354 దాకా జిల్లా కేంద్ర సహకార బ్యాంకులు ఉన్నాయని, సహకార బ్యాంకులు ఎక్కువ శాతం గ్రామీణ ప్రాంతంలో రైతాంగానికి పంట రుణాలు ఇస్తున్నట్లు తెలిపారు. మొట్టమొదటి సహకార బ్యాంకు దక్షిణ భారత దేశంలోనే కాంచీపురం సహకార బ్యాంకు స్థాపించడం జరిగిందన్నారు. అప్పటినుంచి దేశంలో వివిధ రాష్ట్రాల్లో సహకార బ్యాంకులు పనిచేస్తున్నాయని అన్నారు. స్వతంత్రం వచ్చిన తర్వాత ప్రైవేట్ రంగంలో ఉన్నటువంటి బ్యాంకులు ఎక్కువగా స్వార్థపూరిత విధానాలతో పనిచేస్తున్నాయని చెప్పారు. జోనల్ మేనేజర్ ఎస్ ఎస్ ఆర్ మూర్తి, విశాఖ బ్యాంక్ డైరెక్టర్లు చిన్నం రామకోటయ్య, గన్నవరం బ్రాంచ్ ఇన్చార్జి డైరెక్టర్లు పొట్లూరి వెంకటరమణ రావు, చుక్కపల్లి రామారావు పాల్గొన్నారు. ప్రజాశక్తి-మచిలీపట్నంరూరల్ : బ్యాంకింగ్ రంగంలో కొత్త నిర్వచనాన్ని, కస్టమర్ కి సేవ తత్వాన్ని పరిచయం చేసింది ది విశాఖపట్నం కో-ఆపరేటివ్ బ్యాంక్ నని బ్యాంక్ డైరెక్టర్ జె.వి సత్య నారాయణ మూర్తి అన్నారు. ఆదివారం మచిలీపట్నం



మాట్లాడుతున్న విశాఖ బ్యాంకు డైరెక్టర్ మూర్తి

లోని స్థానిక పాలకుర్తి వారి కళ్యాణమండపంలో పొట్లూరి వెంకట రమణారావు అధ్యక్షతన మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1916లో విశాఖపట్నంలో ఒక బ్రాంచ్ గా ఏర్పడి నేడు అనేక బ్రాంచిలుగా ఆవిర్భవించి ఎంతోమందికి ఉద్యోగ అవకాశాలు ఈ బ్యాంకు కల్పించిందని అన్నారు. బ్యాంక్ డైరెక్టర్ చిన్నం కోటేశ్వరరావు, బ్యాంకు డైరెక్టర్ నన్నపునేని జంగయ్య, డిప్యూటీ సీఈఓ ఎం వి. గణేష్ తదితరులు పాల్గొన్నారు.



శరవేగంగా వంతెన నిర్మాణం

ప్రజాశక్తి-పమిడిముక్కల : పమిడిముక్కల మండలంలోని వేల్పూరు గ్రామబంలో వంతెన నిర్మాణం 80 లక్షల రూపాయలతో జరుగుతోందని ఆర్ అండ్ బి ఏ మల్లికార్జున అన్నారు. ఆదివారం ఆయన వంతెన నిర్మాణాన్ని పరిశీలించి మాట్లాడారు. శిధిలావస్థలో ఉన్న కనుమూరు-వేల్పూరు మధ్య ఉన్న కాలువ వంతెన కూలిపోవడంతో టెండర్లు పిలిచి కొత్త వంతెన నిర్మాణం చేస్తున్నామన్నారు. వేల్పూరు గ్రామ సర్పంచ్ రత్నం దిలీప్ కుమార్ మాట్లాడుతూ పామర్రు ఎంఎల్ఏ వర్ల కుమార్ రాజా సహకారంతో పలు అభివృద్ధి పనులు చేస్తున్నట్లు తెలిపారు. వేల్పూర్ వంతెన, త్వరలో పూర్తి అవుతాయని తెలిపారు. అలాగే గ్రామాభివృద్ధికి అనేక కార్యక్రమాలు చేస్తున్నామన్నారు.

మావురమ్మ జాతర



జాతరలో పాల్గొని పూజలు నిర్వహిస్తున్న విక్కుర్తి శ్రీనివాస్

ప్రజాశక్తి-అవనిగడ్డ : అవనిగడ్డ పంచాయతీ శివారు కొత్తపేటలో వేంచేస యున్న శ్రీ రేణుక మావురమ్మ అమ్మవారి జాతరలో ప్రముఖ పారిశ్రామికవేత్త విక్కుర్తి శ్రీనివాస్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. కొత్తపేట గ్రామంలో భూపతి వారి విలవేలు పు రేణుక మా ఊరు అమ్మ అమ్మవారి జాతర మహో త్సవాలు ఈనెల 22వ తేదీ నుండి ప్రారంభమయ్యాయి. జాతర మహోత్సవాలలో చివరి రోజు అయిన ఆదివారం శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు శ్రీనివాసును ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాసవెంట న్యాయవాది విక్కు ర్తి రామకృష్ణ, పులిగడ్డ చంద్ర, భూపతి నాంచారయ్య, రేపల్లె మునలయ్య, రేపల్లె ఈశ్వరరావు, బర్మా శ్రీనివాసరావు పాల్గొన్నారు

సిఎం సహాయ నిధి అందజేత

ప్రజాశక్తి - బంటుమిల్లి : బంటుమిల్లి మండలానికి చెందిన పలువురుకి ముఖ్యమంత్రి సహాయనిధిని ఎంఎల్ఏ ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ ఆదివారం అంద జేశారు. చోరం పూడికు చెందిన నాగిడి శ్రీనివాసరావు కి రు. 37,205, ముల్లపర్రుకు చెందిన గౌరిశెట్టి శరణ్య కి రు.20,250 అందజేశారు.



మజ్జిగ పంపిణీ

ప్రజాశక్తి- గన్నవరం : స్థానిక వీనస్ సెంటర్లో మానవతా సేవాసమితి ఆధ్వర్యంలో శ్రీ దుర్గాభవాని స్వీట్ హోమ్ నిర్వాహకులు చిట్టి సింహాచలం.. కనకదుర్గ సౌజన్యంతో ఆదివారం ప్రయాణికు లకు మజ్జిగ పంపిణీ చేశారు. సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొనడం ఆనందంగా ఉందని చెప్పారు. చిట్టి విజయ్ కుమార్, బాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.




డివైడర్‌ను ఢీకొన్న కారు

కారు డివైడర్‌ను ఢీకొని ఒకరు మృతి

ఐదుగురికి గాయాలు

ప్రజాశక్తి - నందిగామ : నందిగామ పట్టణ శివారు అనాసాగరం ఫ్లైఓవర్‌పై కారు డివైడర్‌ని ఢీకొని ఒకరు మృతి చెందగా, ఐదుగురికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను హైవే పోలీసుల ద్వారా నందిగామ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతదేహాన్ని నందిగామ మార్చురీకి తరలించారు. ప్రాథమిక సమాచారం ప్రకారం తెలంగాణ రాష్ట్రం కాళేశ్వరం సరస్వతి పుష్కరాలు ముగించుకొని తిరిగి వస్తుండగా కారు డ్రైవర్ నిద్రమత్తులో డివైడర్‌ని ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగినట్లుగా అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మృతుడు కృష్ణాజిల్లా పెద్ద పారుపూడి మండలం వెంట్రపగడ గ్రామానికి చెందిన చింటూరి వెంకటేశ్వరరావుగా పోలీసులు గుర్తించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.


నాట్య ప్రదర్శన చేస్తున్న కళాకారులు

నృత్య నాటిక ప్రదర్శన

విజయవాడ : కళలకు సహకారం అందిస్తున్న స్థానిక ప్రేక్షక సంఘం 'దృశ్యవేదిక' సాంస్కృతిక సేవా సంస్థ తమ నెలవారీ సాంస్కృతిక కార్యక్రమంగా ఆదివారం సాయంత్రం గాంధీనగర్ శ్రీవెలిదండ్ల హనుమంతరాయ గ్రంథాలయంలో ఆహ్లాదకర నృత్య, నాటిక ప్రదర్శన కార్య క్రమాన్ని నిర్వహించింది. శ్రీనట రాజ రామకృష్ణ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వ ర్యంలో ప్రముఖ నాట్యాచార్యుడు పిళ్లా ఉమామహేశ్వర పాత్రుడు శిష్యుల ఆంధ్రనాట్యం ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది. ప్రాచీన నట్టువ మేళా సంప్రదాయానికి చెందిన ఆంధ్రనాట్యం, తాత్వికత, నాట్యరసం, భావప్రకాశనలకు ప్రసిద్ధి నటరాజ రామకృష్ణ, కళాకృష్ణ ప్రభృతులు ఈ నాట్య ప్రక్రియకు విశేష ప్రాచుర్యం కల్పించారు. ఎస్.మహేష్, పి.మానస తేజ, టి.జ్యోత్స్న, కె.సాహితి లక్ష్మి, ఎం.హర్షిణి, జి.భార్గవి, టి.చిన్మయి, ఎస్‌కె శర్మిల, పి.జోషిత సాయిలు పలు నృత్యాంశాలతో ఆకట్టుకున్నారు. అనంతరం సాగర్ థియేటర్ ఆర్ట్స్, విజయవాడ వారి 'కాలజ్ఞానం' నాటికను ప్రదర్శించారు. రచయిత నుసుము నాగభూషణం, దర్శకుడు ఈ.శేషు పవన్ కుమార్, ఐ.ఎల్.కాంతారావు, ఈవన భగ్యరాజ్, పవన్ కుమార్, ఈ.విజయసాగర్, ఎస్.అమృతవర్షిణి తమ పాత్రలకు న్యాయం చేశారు. రమణ సంగీతం నాటికకు ఊతమిచ్చింది. ముఖ్య అతిథిగా పరిషత్ నిర్వాహకుడు పోపూరి నాగేశ్వరరావు హాజరయ్యారు. దొంతాల ప్రకాష్, పద్మశ్రీ, బొర్ర నరేన్, కత్తి శ్యామ్ ప్రసాద్, ఈ.రమేష్ బాబు, డీవీ చంద్ర శేఖర్, ఆర్. సత్యనారాయణ పాల్గొన్నారు.



కాలజ్ఞానం నాటికలోని ఓ సన్నివేశం

రాజ్యాంగ నైతికతను కవులు భుజానికెత్తుకోవాలి

ప్రజా వాగ్గేయకారుడు, ఎమ్మెల్సీ గోరటి వెంకన్న


దు:ఖం పండుతున్న నేల కవితా సంపుటి ఆవిష్కరిస్తున్న గోరటి, తదితర ప్రముఖులు

విజయవాడ : రాజ్యాంగ నైతికతను కవులు భుజానికెత్తుకోవాల్సిన అవసరం ఉందని ప్రజా వాగ్గేయకారుడు, ఎమ్మెల్సీ గోరటి వెంకన్న అన్నారు. మల్లెతీగ సాహిత్య సేవాసంస్థ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం గవర్నరుపేట బాలోత్సవ భవన్లో బంగార్రాజు కంఠ రచించిన 'దుఃఖం పండుతున్న నేల' కవితా సంపుటి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభకు ముఖ్య అతిథిగా వచ్చిన ఆయన పుస్తకాన్ని ఆవిష్కరించిన అనంతరం మాట్లాడారు. సోషల్ మీడియాలో ఒక లైక్ కోసం జీవితాల్ని కోల్పోతున్న ప్రమాదకరమైన వాతావరణంలో మనం జీవిస్తున్నామన్నారు. ఇలాంటి సమయంలోనే కవులు ఉమ్మడిగా గొంతెత్తాలన్నారు. కవులకు ఏ విషయాన్నయినా కవిత్వం చేసే హక్కు ఉందన్నారు. కవుల్ని ఎవరూ శాసించవద్దన్నారు. సభకు అధ్యక్షత వహించిన డాక్టర్ బిక్కి కృష్ణ మాట్లాడుతూ దేశంలో ఎక్కడా క్రమశిక్షణ లేదన్నారు. సినీగేయ రచయిత రసరాజు మాట్లాడుతూ కవికి సొంత డిక్షన్ కావాలన్నారు. సుప్రసిద్ధ కవయిత్రి, విమర్శకురాలు ఘంటశాల నిర్మల మాట్లాడుతూ స్త్రీలను గౌరవించేదే గొప్ప సంస్కృతి అన్నారు. సమాజంలో ప్రతీచోట స్త్రీలపై జరుగుతున్న వివక్షాపూరిత మానసిక మారణకాండను కవులు నిరసించాలన్నారు. ప్రసిద్ధ కవి, విశ్లేషకులు కావ్య విశ్లేషణ చేస్తూ – ముక్తిని డోర్ డెలివరీ చేస్తున్న నేటి కాలంలో కవులు మూలాల రక్షణ ఎరుకతో రాయడం మౌలిక అవసరమన్నారు. పీడితుల దుఃఖాన్ని కళాతత్వంగా చెప్పడం నేటి సాహిత్యంలో కొత్త అభివ్యక్తి అన్నారు. కవులు వస్తువుతో తపస్సు చేస్తే తప్ప కొత్త కవిత్వం రాదన్నారు. మల్లెతీగ సాహిత్యసేవాసంస్థ అధ్యక్షులు కలిమిశ్రీ మాట్లాడుతూ పుస్తకాలు కొనడమంటే కవులు, రచయితలను గౌరవించడమే నన్నారు. ఇంటి నిర్మాణానికి పరిమితులిచ్చే అధికారులు ఆ ఇంట్లో ఒక పుస్తకాల గది వుండడం తప్పనిసరి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐఆర్‌ఎస్ అధికారి, ప్రముఖ కవి డాక్టర్ జెల్ది విద్యాధరరావు, పోలీసు అధికారి, కవి లోసారి సుధాకర్, పుస్తక రచయిత బంగార్రాజు కంఠ, సాహితీవేత్తలు డాక్టర్ ఘంటా విజయ్ కుమార్, సరికొండ నరసింహరాజు, వొరప్రసాద్, శిఖా ఆకాష్ తదితరులు పాల్గొని మాట్లాడారు. కార్యక్రమాన్ని చొప్పా రాఘవేంద్రశేఖర్ పర్యవేక్షించారు.

అను హాస్పిటల్ ఆధ్వర్యంలో సిఎంఇ ప్రోగ్రాం


మాట్లాడుతున్న డాక్టర్ రమేష్

ప్రజాశక్తి - హెల్త్ యూనివర్సిటీ : గైనకాలజి, పీడియాట్రీ, ఫెర్టిలిటీ విభాగంలో వచ్చిన అధునాతన వైద్య విధానాల గురించి వైద్యులకు అవగాహన కల్పించేందుకు కంటిన్యూయస్ మెడికల్ ఎడ్యుకేషన్ (సిఎంఇ) ప్రోగ్రాంను నిర్వహించామని అను గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ చైర్మన్ డాక్టర్ రమేష్ తెలిపారు. దేశంలోని నిష్ణాతులైన వైద్యులను పిలిపించి, వైద్య చికిత్సల్లో వచ్చిన సరికొత్త వైద్య పరిజ్ఞాన్ని ఇక్కడి వైద్యులకు తెలియజేశామన్నారు. సుమారు 400 మంది వైద్యులు సిఎంఈ ప్రోగ్రాంలో పాల్గొన్నారని చెప్పారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్, విజయవాడ ఒబెస్ట్రిక్స్ అండ్ గైనకాలజి సొసైటీ సౌజన్యంతో అను మై బేబీ ఆసుపత్రి ఆధ్వర్యంలో పేరినటాలజి అండ్ రిప్రొడక్టివ్ మెడిసిన్ కంటిన్యూయస్ మెడికల్ ఎడ్యుకేషన్ సిఎంఇ 2025 సదస్సు మహాత్మాగాంధీ రోడ్‌లోని ఓ హోటల్‌లో ఆదివారం నిర్వహించారు. ఈ సదస్సుకు జిల్లా చుట్టుపక్కల ఉన్న నాలుగైదు జిల్లాల నుంచి 400 మంది గైనకాలజిస్టులు, పీడియాట్రిషియన్‌లు పాల్గొన్నారు. దేశంలో నిష్ణాతులు, అనుభవజ్ఞులైన వైద్యులు గైనకాలజి, పీడియాట్రీ, ఫెర్టిలిటీ విభాగాల్లో వస్తున్న అధునాతన వైద్య విధానాలు, చికిత్సలు గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అను గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ చైర్మన్ డాక్టర్ రమేష్ మాట్లాడుతూ గైనకాలజి, పీడియాట్రీ, ఫెర్టిలిటీ విభాగాల్లో అడ్వాన్స్ ట్రీట్‌మెంట్స్ అందుబాటులోకి వచ్చాయని అన్నారు. ఈ అడ్వాన్స్ ట్రీట్మెంట్స్ పట్ల వైద్యులు అందరు అవగాహన కలిగి ఉండాలని ఆయా రంగాల్లో నిష్ణాతులైన డాక్టర్స్‌ను పిలిపించి, ఇక్కడ డాక్టర్లకు నాలెడ్జి షేర్ చేసినట్లు తెలిపారు. నొప్పి లేని ప్రసవాలు రావడం, సిజేరియన్‌లు తగ్గించడం, అప్పుడే పుట్టిన పసిపిల్లలకు రిస్క్ లేకుండా ఎలా ఉండడం, అప్పుడే పుట్టిన పిల్లలకు చేయాల్సిన సర్జరీల్లో వచ్చిన అడ్వాన్స్‌మెంట్‌ల గురించి తెలియజేసినట్లు చెప్పారు. అను గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ పీడియాట్రిక్ సర్జన్ డాక్టర్ రవికుమార్ మాట్లాడుతూ అను మై బేబీ హాస్పిటల్‌లో నియోనాటాలజి సర్వీసెస్‌లు అడ్వాన్స్‌గా ఉన్నాయని, గైనకాలజి విభాగం కూడా సరికొత్త వైద్య విధానాలను పాటిస్తోందన్నారు. పీడియాట్రిక్ సర్జరీ విభాగంలో రోజుల పిల్లలకు ఆపరేషన్ చేయడానికి అన్ని రకాల సదుపాయాలు ఉన్నాయన్నారు. డాక్టర్ కవిత, డాక్టర్ శ్రీదేవి బత్తుల మాట్లాడుతూ అను మై బేబీ హాస్పిటల్‌లో ఐదుగురు గైనకాలజిస్ట్‌లు ఉన్నారని, 24 గంటలు సర్వీస్‌లు అందిస్తున్నామని చెప్పారు. తమది మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ అని, అన్ని స్పెషాలిటీ వైద్యులు అందుబాటులో ఉంటారని చెప్పారు. ఎవరైనా డాక్టర్‌కు ఫోన్ చేసి, కాంప్లికేటెడ్ కేసు అని చెబితే, తాము అన్ని రకాల వైద్య సేవలు అందించడానికి సిద్ధంగా ఉంటామని చెప్పారు.

రహదారిపైనే వర్షపు నీరు

ప్రజాశక్తి - మైలవరం : విజయవాడ బైపాస్ రోడ్డు పెట్రోల్ బంకు సమీపంలో జాతీయ రహదారిపై వర్షపు నీరు చేరడంతో స్థానికులు, వాహనదారులు, తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.


మైలవరంలోని విజయవాడ జాతీయ రహదారి బైపాస్ రోడ్డుపై నిల్వ ఉన్న వర్షపు నీరు

ఈ జాతీయ రహదారికి ఇరువైపులా డ్రైనేజీ సౌకర్యం లేకపోవడంతో వర్షపునీరు, నివాసాల్లోని నీరు రహదారి పైకి చేరి రోజుల తరబడి నిల్వ ఉంటోంది. దీంతో మురుగుగా ఏర్పడి దుర్వాసన వస్తుందని తద్వారా దోమలు ప్రబలి రోగాలు బారిన పడుతున్నామని పలువురు వాపోతున్నారు. ఈ రహదారి గుండా తిరువూరు, విజయవాడ, భద్రాచలం, నూజివీడు, రెడ్డిగూడెం, విసన్నపేట, ఇబ్రహీంపట్నం, తదితర ప్రాంతాలకు నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తూ ఉంటాయి. వాహనాలు వెళ్ళేటప్పుడు మురుగునీరు చింది పాదచారులపై పడటంతో గొడవలు జరిగిన సందర్భాలు కూడా ఉన్నాయని పలువురు పేర్కొంటున్నారు. అధికారులు స్పందించి జాతీయ రహదారి అయిన విజయవాడ బైపాస్ రోడ్డు సమీపంలో నీరు నిలవ లేకుండా డ్రైనేజీ ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.



చందర్లపాడులో మాట్లాడుతున్న కళ్యాణ్

జూలై 9న సమ్మెను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - చందర్లపాడు : లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలని కోరుతూ జులై 9న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ చందర్లపాడు అలివేలమ్మ దేవస్థానం నుండి సెంటర్ వరకు ఆశ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సిఐటియు మండల కార్యదర్శి వేల్పుల ఏసోబు అధ్యక్షత వహించారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కోట కళ్యాణ్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిఐటియు చందర్లపాడు అధ్యక్షులు ఈదర కమల, ఆశ వర్కర్ల యూనియన్ నాయకురాలు వేల్పుల రాణి కాస్తాల మేరీ, కె.భారతి, డి.ఈశ్వరమ్మ, మల్లేశ్వరి, వివిధ గ్రామాల ఆశా వర్కర్లు పాల్గొన్నారు. **విజయవాడ :** భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని జూలై 9న దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని కరపత్రాల ఆవిష్కరించారు. బెంజ్ సర్కిల్ కార్మికుల అడ్డా వద్ద నిర్వహించిన ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మికుల నగర అధ్యక్షులు వి.బి.రాజు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బెంజ్ సర్కిల్ ముఠా నాయకులు మాజేటి నాగమల్లేశ్వరరావు, బి.దుర్గారావు, ఆర్.రామకృష్ణ, డి.వెంకన్న వి.అప్పారావు, ఎం.జె.నాయుడు, వి.జోగి నాయుడు, వి.నరసింహారావు తదితర కార్మికులు పాల్గొన్నారు.


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న కార్మికులు, నాయకులు

వీధులు జలమయం

ప్రజాశక్తి - వీరులపాడు : మండలంలో పలు గ్రామాల్లో ఆదివారం కురిచిన భారీ వర్షాలకు పలు వీధుల్లో జలమయ్యాయి. గ్రామాల్లో డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేకపోవడం వల్ల వర్షపు నీరంతా రోడ్డుపై నిలిచిపోయింది. వేసవి ఎండలు ఉక్కపోతకు ప్రజలు విసుగు చెందడంతో ఆదివారం కురిసిన వర్షంతో ఒక్కసారిగా వాతావరణం అంతా చల్లబడింది. వృద్ధులు, చిన్నపిల్లలు ఎండ తాకిడి నుంచి బయటపడ్డారు. భారీ వర్షంతో రైతుల్లో కూడా వ్యవసాయానికి అనుకూలంగా ఉంటుందని, మరో వారంలో విత్తనాలు నాటుకునే అవకాశం ఉందని రైతులు పంట పొలాల్లో వ్యవసాయ పనులు ముమ్మరం చేశారు.